TEXT PROBLEM WITHIN THE BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204552
UNIVERSAL LIBRARY

# నైవేద్యము

దువ్వూరి రామిరెడ్డిగారిచే రచియింపఁబడి

సరస్వతీ భాండారమువారిచేఁ
ప్రకటింపఁబడినది.

శ్రీ

ఇండియా ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడియె.

చెన్నపురి:

**1924.**

PRINTED AT
THE INDIA PRINTING WORKS.
MADRAS.

# ప్రేమాంకము

దారినిఁ బోవుచుండ నొకతట్టున రత్నమయాచితంబు చే
కూరినరీతి నాయెడఁదఱున్ సరిదాఁకిన మిత్రుఁడున్ మనో
హారి కళాతపస్వి, సరసాత్ముఁడు, మోమునఁ బ్రేమమాధురీ
సారము చిప్పిలం బరులస్వాంతము లాగెడి యింద్రజాలికుం
డై రమణీయభావకవితాంచితుఁడై చెలువారు రాజమ
న్నారు సఖుండుగాదొరకె నాకుఁ; దదాప్తత కానవాలుగన్
కోరియొసంగితిం గృతినిఁ గూరిమినెచ్చెలి కంకితంబుగన్.

22-12-1923.
పిమ్మారెడ్డిపాలెము.

ప్రియమిత్రుఁడు,
దువ్వూరి రామిరెడ్డి.

# దువ్వూరి రామిరెడ్డిగారి గ్రంథములు

| | | | |
|---|---|---|---|
| 1. | నలజారమ్మ అగ్నిప్రవేశము | (పద్యకావ్యము) | 1917 |
| 2. | కృషీవలుఁడు | ,, | 1919 |
| 3. | వనకుమారి | ,, | 1920 |
| 4. | జలదాంగన | ,, | 1920 |
| 5. | సీతావనవాసము | (నాటకము) | 1921 |
| 6. | నక్షత్రమాల | (ఖండకావ్యములు) | 1921 |
| 7. | నైవేద్యము | ,, | 1924 |
| 8. | కడపటి వీడికోలు | (పద్యకావ్యము) | 1924 |
| 9. | కవిత్వ తత్త్వనిరూపణము | (వ్యాసములు) | 1924 |

"రెడ్డిగారు వయసునఁ జిన్నలయ్యును గవితాకళాప్రదర్శనమునందు మిన్నలు. వీరు రచియించినగీతములు ఒక్కమాఱు విన్నంతనే యెట్టివారిహృదయములనైన నార్జింపఁగల రసమహితములుగ నున్నవి. ఆంధ్రులకు వీరికవిత్వము క్రొత్తదిగాదు. చక్కనిశయ్యయును శయ్యోచితములగు భావములును రెడ్డిగారి కవిత్వమునకుఁ బెట్టనిసొమ్ములు."

ఆంధ్రపత్రిక.

# శుద్ధిపత్రము

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 19 | వితర్ధిక | వితర్దిక |
| 2 | 6 | జటలోకా | జటలోకో |
| 6 | 16 | పార్ధనాంజలి | ప్రార్థనాంజలి |
| 15 | 16 | గాఢ | గాధ |
| 16 | 5 | సన్యాసి | సన్న్యాసి |
| 19 | 21 | తత్వము | తత్త్వము |
| 23 | 16 | పోనరునో | పుష్పించు |
| 68 | 5 | వరముల | వర్ణముల |

*

గతిప్రసరణముల ననుసరించి చదువవలయును. (లేక పాడనూ పాడవచ్చును.) రామచిలుక, పంచవన్నెలు, వైకుంఠవాకిళ్లు మున్నగు గ్రామ్యసమాసములు నిరంతరాయముగ భాషలోనికిఁ బ్రవేశించి రూఢము లైనవిగాపున నటువంటి సమాసములను నే నంగీకరించితిని.

"కళ" యను మాసపత్రికకు సహాయసంపాదకులును నాదు ప్రియమిత్రులు నగు ఆర్. రామారావు. బి.య్యే.బి.యల్ గారు, నాపరోక్షమున ముద్రింపఁబడు ఈ పుస్తకముయొక్క ముద్రణకార్యములయందు చాల శ్రద్ధవహించి, స్వయముగ ఫ్రూపులు దిద్ది వలయుసాహాయ్యమంతయుఁ జేసిరి. లేకుండిన ఈగ్రంథ మింతత్వరలో వెలువడునది గాదు. వారు హృదయ పూర్వకముగ నెరవేర్చిన స్నేహితధర్మమునకు నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

పెమ్మారెడ్డిపాళెము.
17–8–1924.

దువ్వూరి రామిరెడ్డి.

# విషయసూచిక


| | | | | |
|---|---|---|---|---|
| 1. నైవేద్యము | ... | ... | ... | 1 |
| 2. కర్ణధారి | ... | ... | ... | 2 |
| 3. బాటసారి | ... | ... | ... | 4 |
| 4. మర్త్యకవి | ... | ... | ... | 5 |
| 5. రాధాకృష్ణులు | ... | ... | ... | 7 |
| 6. వాల్మీకి | ... | ... | ... | 11 |
| 7. కవి : సన్న్యాసి | ... | ... | ... | 14 |
| 8. మాతృమందిరము | ... | ... | ... | 17 |
| 9. హృదయాభిలాష | ... | ... | ... | 23 |
| 10. భవిష్యద్దర్శనము | ... | ... | ... | 24 |
| 11. సమరతృష్ణ | ... | ... | ... | 27 |
| 12. మేలుకొలుపు | ... | ... | ... | 31 |
| 13. వానకాలపువరిచేలు | ... | ... | ... | 32 |
| 14. హతాశ | ... | ... | ... | 33 |
| 15. శైశవస్మృతి | ... | ... | ... | 35 |
| 16. అభిసారిక | ... | ... | ... | 38 |
| 17. గరిక. | ... | ... | ... | 39 |
| 18. దీపనిర్వాణము | ... | ... | ... | 40 |
| 19. వీణాప్రియ | ... | ... | ... | 41 |
| 20. సేవ | ... | ... | ... | 43 |
| 21. ప్రబోధశంఖము | ... | ... | ... | 44 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 22. | రజని | ... | ... | ... | 45 |
| 23. | అభిసారిక | ... | ... | ... | 46 |
| 24. | ఆగంతుకి | ... | ... | ... | 47 |
| 25. | పిచ్చిబికారి | ... | ... | ... | 49 |
| 26. | బాష్పదౌత్యము | ... | ... | ... | 51 |
| 27. | అతిథి | ... | ... | ... | 53 |
| 28. | మోహినీప్రకృతి | ... | ... | ... | 54 |
| 29. | జీవనద్వేషి | ... | ... | .. | 55 |
| 30. | ఆనందసత్రము | ... | ... | ... | 58 |
| 31. | ఆమనినిషా | ... | ... | ... | 59 |
| 32. | లూశీ | ... | ... | ... | 60 |
| 33. | పూర్వజన్మస్మృతి | ... | ... | ... | 61 |
| 34. | మృత్యువు | ... | ... | ... | 63 |
| 35. | బిడ్డ : బాటసారి | ... | ... | ... | 71 |
| 36. | మేలుకొలుపు | ... | ... | ... | 73 |
| 37. | వసంతోదయము. | ... | ... | ... | 74 |
| 38. | ముసలిమాలెత | ... | ... | ... | 75 |
| 39. | పండితప్రతిజ్ఞ | ... | ... | ... | 82 |

# నైవేద్యము

---

తల్లి, నీయుత్సవముఁగాంచఁ దరలినార
లనుఁగుఁ దనయులు నైవేద్యహస్తు లగుచు ;
ధన్యులెల్లరు నానార్హోచితంపుఁ గానుక
లర్పణము సేయవచ్చిరి ; యంగికొమ్మ.

స్వర్ణసుమముల నర్చన సలుపువారు
భాగ్యవంతులు నీపాద పద్మములకు ;
ఏమి లేనట్టి భిక్షుకుం డేని నేఁడు
కంటి క్రొన్నీటి ముత్యాలకానుక లిడును.

పూజ్యులధములు, ధనికులు పుట్టుబీద
లనెడి యెడలేక యెత్తిరి హారతులను ;
భక్తిపరవశులైన యీ ప్రజలగీతి
దిక్కుదిక్కులయందుఁ బ్రతిధ్వనించు.

అమ్మరో! నీమహామందిర ప్రాంగణమున
మండుచున్నది కర్పూర ఖండగణము,
త్యాగపరిశుద్ధ మగు నాత్మఁ దలఁగిపోవు
కామనలటు ధూమరేఖలు గడలుకొనఁగ.

ప్రొద్దుపొడుపున నీపాదపూజకొఱకు,
కవిని, తెచ్చితి దోసిటఁ గన్నెపూలు ;
బలివితర్ధిక నిరతంబు వెలుగునటుల
హృదయపు సుగంధదీప మర్పింతుఁ గొనుము.

---

# * కర్ణధారి

సందెచీఁకటి దెసలఁ జక్కనలమెం;
గాఱుమబ్బులు చుక్కగములఁ గ్రమ్మెం;
బ్రబలవేగానఁ దుపాను వీచెన్;
ఆకసము గీకసం బావిలింపన్
గర్జించె మేఘాలు కంపమెత్తన్;
నటియించు భైరవు జటలోకోనాన్
నురుగుఁ గ్రక్కెడి కడలి తరఁగగుంపుల్
చెలియలికట్టపైఁ జిందులాడన్;
ఉన్మత్తప్రకృతి నృత్యోత్సవంబుల్
మింటిని మంటిని మేళవింపన్

గడిమి విడువకు కర్ణధారీ,
పడవ నడుపుము భయముదీఱ.

నడిసముద్రంబునఁ బడితినంచున్
జడివాననిలువంగ జాలనంచున్
వడిగండ్ల 'బాంబులు' పడునోయంచున్
గటికచీఁకటిఁ గన్ను గాననంచున్
ఒంటినైతిని సాయ ముండదంచుం
బరిపరి విధముల భావింపఁగం

ప్రాణసంశయమునఁ బలవింపఁగన్
సమయంబుగాదిది జడచిత్తుఁడా!
చినిగిన తెఱచాప చెఱఁగులెల్లన్
సవరించి, యాత్మవిశ్వాసంబునం
గడిఁబు విడుపకు కర్ణధారీ,
పడవ నడుపుము భయముదీఱ.

పుడమిఁ బ్రాఁకెడు చిన్ని పురుగువోలెం
గష్టనిష్ఠురవిధి కాలిక్రిందం
బడి చిందుచిందురై ప్రాణమేదం
బుట్టలేదోయి యే పురుషుఁడైనం.
గ్రిందికి దింపకు కేతనంబున్;
'సెర్చిలైటులు' వోలెఁ జీఁకట్లలోన్
మెఱసెడిఁజూడు క్రొమ్మెఱుఁగుఁదీఁగల్
దారిఁజూపెడు ధ్రువతార పైనన్
మిణుకుమిణుకను వెల్గు మేఘాలలోన్.
జీవనదీపమై చెలఁగు నాసన్
మలపక పాథోధి మధ్యంబునం
గడిమి విడువకు కర్ణధారీ,
పడవ నడుపుము భయముదీఱ.

# బా ట సా రి

నిశ్శబ్దయామిని నీరవవీణ
తంతులఁ గదలించు తరుణీలలామ!
యింత తటాలున నేల నిల్పితివి
రమ్యమూర్ఛన లీను రాగంబులెత్తి?
యానందమదిర పొంగారు పాత్రంబుఁ
బెదవులకంటించి పెటికివైచితివి.
యాకణంబానిన యనుభూతివలన
హృదయంబు పిచ్చెత్తి యెగురు నెందెందొ!
యర్ధరాత్రం బాయె; నంధకారంబు
దిక్కుల వ్యాపించెఁ; జుక్కలగములు
మబ్బుచాటునదాగి మాయమైపోయె;
జల్లుజల్లున వాన జడివెట్టి కురిసె;
బాటసారిని, వన్యపథమందుఁ జిక్కి
దిక్కుదోఁపక యొంటి ద్రిమ్మరువాఁడ;
ఆరుపఁబోకు గవాక్షంబునందుఁ
గాంతిల్లు దివ్యసుగంధదీపంబుఁ;
దలుపుఁదీయుమ దీర్ఘదైనిక శ్రాంతి
స్వప్నశీతస్పర్శ సమసి సుఖింపఁ,
గొంత యొక్కింత నేఁ గన్నుమోడ్చెదను.

## మర్త్యకవి

అనవరతంబు నీవంతః ప్రపంచ
గంభీర నిర్మల గగనంబునందు
నెగిరిపోయెద వోయి యెట్టులఁబట్టినను
ఓ మర్త్య కవిమాళి! యూహవంచించి.
యేకాననంబున, నే మూలయందొ,
యేపూవుఁబొదరింట నేయాకుసందొ,
వినరాక కనరాక వికసించి, తావి
యూర్చెడు క్రొంబువ్వ నోజ నెయ్యెడనొ
వసియించెదవుగాని వనకుటీరమున,
నీ యపూర్వపుసృష్టి నీలాంబరమున
రతనాలవిల్లునా రమ్యమైతోఁచు.
అప్సరోవీణల యందుద్భవించు
రాగంపుగఱులు స్వర్గద్వారమునకు
హృదయంబుఁ గొంపోవురీతి, నీకావ్య
పుష్పకంబు రసార్ద్ర పులకితాత్మలను
జీవనయాథార్థ్య సీమలం దుండి

కొనిపోవు నందన వనగంధవహము
వీతెంచుకల్పనా శీతనగంపుఁ

గడపటిశృంగంబు కడకొక్క త్రుటిని.
చంద్రకిరణంబుల జనియించినట్టి
యాస్వప్నలోకంపు టచ్చఱబోంట్లు
పటికంపుఁ బాత్రల పైయంచు పొరల

ద్రాక్షాసవముఁ దెచ్చి దగ్గఱఁ జేరి
యందీయఁ దమిదీఱ నాని, మత్తెక్క

యఱగన్ను మోడిచి, యన్నికష్టముల
మఱచి సుఖింతు నీమహిమంబు వలన.

మిన్నుపైఁబడినను మేలుకొల్పకుము ;
ఆనందరసవార్ధి యందీఁదనిమ్ము.
కవికులాభరణ ! నీకావ్యమాధురికి
వినిమయంబుగనీయ విశ్వంబునందు

నేమియుఁగన్పట్ట దీఁడైనయటుల !
పార్థనాంజలిపుటి బాష్పముత్యముల

యుపహారమిచ్చి నేనొక్క వందనము
నర్పించుచున్నాఁడ నందికోవయ్య.

# రా ధా కృ ష్ణు లు

## రా ధ

ఏమోయి శ్రీకృష్ణ, యింత ప్రొద్దాయెఁ
గనులకు నీరూపు కఱవాయెనేమొ !
సంజరంగులలోన సమసె గోధూళి;
వేణుసంగీతంబు వినువీథిముట్టెఁ ;
కాళిందిమడుగులోఁ గలఁ బూచియున్న
కలువపూనెత్తావి గాడ్పులు విసరె ;
ఆమనితోఁటకు నతిథియౌఁబికము
ప్రేమప్రవాహంబు వెలికుబ్బిపాఱి
హృదయతటాకంపుఁ దుదితూముఁ దెఱచె;
నీయందు లీనమై, నినుఁగాంచువేడ్క
నాతురపడుమతి నాఁపంగ లేక
వాకిట నిలుచుండి వనవీథినెపుడుఁ
గనికని నాకన్నుఁగవ నీరుగ్రమ్మె.
నింతకక్కస మేల యింతకసి యేల ?
చంపనెంచిన నింత చాటుఁదన మేల ?
నీనవ్వు విన్నంత నిన్నుఁగన్నంత

వచ్చె నాప్రియుఁడంచు భావింతుఁగాని,
యవ్వల స్మృతిదక్క నంతయు నింద్ర
జాలమ ట్లేడకో జాఱిపోయెదవు!
నిన్నునమ్మినదాని నిన్వలచుదాని
నీపదంబులఁ జిత్త నీరేజ కళిక
నిడుతపస్విని జీవనేంద్రచాపంబు
ఖండించెదేమోయి, కఠినహృదయుఁడ!

## కృ ష్ణుఁ డు

ఓముద్దరాల, నన్నూరక యేల
కానిమాటలు పల్కి కటకటించెదవు?
యమునగట్టులనుండి యాల మరలించి
వచ్చితి నిప్పుడే వనసీమదాఁటి;
కావిదుమారంబు క్రమ్మినచేల
మైనఁ దీలేదింక నరయు మోచెలియ.
నిష్కారణపు శంక నిందింపఁ దగదు,
తథ్యమారసి నన్ను దండింపరాదె?
లావణ్యసరసిలో లాస్యంబు లాడు
నీమోముదమ్మి యేనిమిషంబె కాని
చూడకుండిన నాకు శూన్యమౌ జగము.
మున్నటి వలపులు ముద్దుముచ్చటలు
మఱచి యిట్లాడెదో మతిలేనిదాన!

రాధ

ఔగాని, శ్రీకృష్ణ, యా మాయవలపు
బయలయ్యె, నింతగా వర్ణింపనేల?
వలిపపు వలెవాటుపైఁ బసపుగుర్తు
లతికినట్టుల నేల యయ్యెనో చెపుమ.

కృష్ణుఁడు

మోదుగాకులుగోయ ముదిమోక లెక్కఁ
బువ్వుల రసమంటి పుట్ట మిట్లాయె.

రాధ

తాఁకినఁ గందెడు తనువుపై నేల
గోటిగిచ్చులు పడ్డ గుర్తు లగుపట్టు?

కృష్ణుఁడు

ఇందుకే శంకించితే పువ్వుఁబోఁడి,
కోరిందపొదలోనఁ గోవుదూడేఁగ
వెన్నంటి పోయెడివేళఁ గంటకము
లంటి గీతలుపడె, ననుమానమేల?

రాధ

చివురుటాకులువోని చెక్కిళ్ల సొబగు
కలఁగిన రుచి దోఁచు కారణంబేమి?

కృష్ణుఁడు

మావిగున్నల నీడ మధ్యాహ్నవేళ
నలసి నిద్రించెడు నప్పుడు గలిక
యొరయిక నొక్కింత యొత్తిగిలె నేమొ.

రాధ

అందాల కందమా నధరబింబమునఁ
గాటుకమరకలు గనుపట్ట నేల ?

కృష్ణుఁడు

నీకన్నులకు సాటి నిలిచి వలపింప
ముదముతోఁ గల్వల ముద్దిడికొంటి ;
ఆరంగు పెదవుల కంటెనో యేమొ,
ఏ నొక్కతప్పిదం బెఱుఁగ నోసకియ.

# వాల్మీకి

వాల్మీకి కవిచక్రవర్తి! నీవెవరు,
సరస కవితాలతా శాఖలందుండి
యామనికోయిల యట్లు గూసెదవు?
ఎచ్చోటఁ బుట్టితి వేడ పెరిగితివి?
యేతల్లి చనుఁబాల నింతమహిమంబుఁ
గాంచితో చెప్పుమ కవిసార్వభౌమ!
నింగిని భేదించు నీమహాసృష్టి
యెదుట నీచారిత్ర మెందడఁగిపోయె?
గంగానదీ శీతగర్భంబునందు
నిదురించుచున్నదా నీచరిత్రంబు?
అభ్రంకష హిమాచలాంతరకటక
గంభీర గహ్వరాగాధశూన్యమున
మాఱుమ్రోసెడునె నీమహనీయవాణి?
ఓయాదికవిరాజ! యోదివ్యవాగ్మి!
యెన్ని యేండ్లనుబూంట్లు నేఁగెనోఁగాని
మున్ను హిమాలయ మోహనాటవుల
నీవుమీటిన కావ్య నిర్నిద్రవీణ
నేఁటికి వినఁబడు నిఖిలదేశముల!
భావకిరణంబులు పడుగుపేకలుగ
నీవల్లినట్టి రమణీయదృశ్యంబు

బంగారుస్వప్నంబు ప్రజలనెల్ల పుడు
నానంద రసవార్ధియందుఁ దేలించు.
నీచేయి సోకిన నిమిషంబునందె
బంకమన్నైనను రూపముఁదాల్చి నిలుచు !

ఈ యింద్రజాలంబు నేడ నేర్చితివి ?
యీశిల్పనైపుణి యెట్టు లలవడియె ?
ప్రకృతిభాండారంపు ద్వారంబు తెఱచి
గుప్తరత్నంబులఁ గొల్లగొట్టితివి !
యాకాశమునఁగల యన్నితారకలు
కడలి గర్భమునందుఁ గల జీవమణులు
సరితూఁగలేవు నీ సౌభాగ్యమునకు !
భావనారిధిఁ బూల పడవ నడిపించి,
ముత్యాలరేవులో మునిగి, యడుగంటి,
పలురంగు మణులను వలసిడ్చి తెచ్చి,
నవ్యమౌఁ గావ్యమండన మొండొనర్చి
విశ్వసాహిత్యంబు వెలిగించినావు !
కవితానభోరవీ ! కవిచంద్రులెల్ల
నీకాంతిపూరంబు నిండారఁ ద్రావి
తమకళ పెంపొంద దైవాఱుచుంద్రు.
నీమనోవల్లకీ నినదంబుఁగాంచ

సాధ్యంబుగామి నాశారద వీణ
నేమూలవై చెనో యెఱుఁగంగరాదు.
నీసృష్టికెదురుగా నిలిచి నిట్టూర్చి
తమ్మిచూలియునైనఁ దలవంప వలయుఁ.
బుట్టించితివిపో యపూర్వమూర్తులను
హైందవసామాజ కాదర్శములను ;
రామాయణము నీదు రమణీయభావ
నందనవనిఁ బాఱు నవ్యనిర్ఝరము ;
హైందవసంఘమీ యమృతంపుటూఁటఁ
దరతరంబులనుండి తమిదీఱ నాని
నవజీవనపు శక్తి నవధర్మరక్తిఁ
గాంచి లౌకికయాత్ర గడిపెడినహహా !
జాతీయకవి ! నమస్కారశతంబు
లర్పించి నీచరణాబ్జ రేణువులఁ
దలఁదాల్చితినిఁ ; జంద్రతారకాభరిత
నీలగగనముక్రింద నిలుచున్నయపుడు
మనుజునియల్పత మతిఁదోఁచునటుల
నీప్రతిభావాహినికి ముందునిల్చి
నాకవిగర్వంబు నాభావశక్తి
దుమ్ముదుమారమై దూలిపోయెడిని.

# కవి : సన్న్యాసి

[అస్తమయము ; సముద్రతీరము. ఒక సన్న్యాసి యింద్రధనువురంగులు గల గుల్లలను నొడినిండ నేరికొని, సముద్రతరంగములు పాదముల నభిషేకించునట్లు, తీరమునఁగూర్చుండి, గుల్లపడవలను దేలించుచుండును. ఇంతలో నొక దివ్యపురుషుఁడు వేణువును మ్రోయించుచు నాకసమునుండి యచ్చోటికి దిగును.]

సన్న్యాసి

(స్వగతము)

సాంధ్యవర్ణాంకిత జలధరదూత
యనఁగ నెవ్వండీతఁ డంబరమునుండి
తీరసైకతమున దిగుచున్నవాఁడు !

(ప్రకాశముగ)

ఎవ్వండవోయి, నీ విబ్బోళయందు
జెక్కలుపుట్టి చరించెడు నింద్ర
జాలంపు మురళివై స్వర్గంబునుండి
యవతరించెదవు మానవలోకమునకు ?

కవి

సన్న్యాసితిలక, నే స్వప్నపురవాసి
శిల్పినిగాని, — నీచేష్టలుగాంచ
నుబుసుపోకకువచ్చి యుదధివీచికల
గుల్లపడవలు తేల్చి క్రుంగంగ నవియుఁ
గన్నీరు నించినగతి గానిపించు.

సన్న్యాసి

స్వప్నపురవాసి, నే, జాలరిభంగిఁ
గడలిమధ్యంబునఁ బడవ నడిపించి

మంచిముత్యంబుల మణులఁగడింపఁ
బలుమాఱు వలలీడ్వ వత్తునేగాని,
చటుల ఝంఝూవాత సంక్షుబ్ధవార్ధి
కల్లోలములఁజిక్కి కడగాంచలేక
పడవ తుత్తునియలై పగులునో యంచు
నూహించి, భయపడి, యొడ్డుకునెట్టి,
శూన్యభావంబున శుక్తిపోతములఁ
దీరవీచులయందుఁ దేలించుకొనుచుఁ
గాలంబుఁ గడపెదఁ గపటసంతృప్తి.
ఔ గాని, నీవేమి యాచరించెదవు!
వేణువాదనమె నీవృత్తియాయేమి?

కవి

అంబరచరులైన యధ్వగులకొఱకు
విశ్వంబునంగల వివిధనక్షత్ర
గణముల నొండొంటిఁగలుప రత్నాల
వింటి వంతెనలు కల్పింతు రమ్యముగఁ;
గడలిఁద్రచ్చిన గాథకావ్యంబు లల్లి
యున్మత్తవీచుల యుద్ఘోషలెల్ల
నిశ్శబ్దరజనీ వినీలగర్భమున
శ్రావ్యమౌ నప్సరస్సంగీత మటుల
నొనరింప వేణువు నూదుచుండెదను.

సన్న్యాసి

ఓమంత్రకాఁడ, నీవేమేమొ నుడివి
మోసగించెదవు సమ్మోహంబుఁగొలిపి.
యొకచేత నమృత మింకొకచేత విషము
నాను మాను మటంచు నందియిచ్చెదవు !

కవి

అదియె జీవనరహస్యంబు సన్న్యాసి,
చేదుతీపులు రెండుఁ జేరియేయుండు,
నొకటి యుండినచోట నుండు రెండవది.
పడవ వ్రీలునటంచు భయపడెదవేని
జలధి దున్నెడు కోర్కెఁ దలపోయఁబోకు.
అలల రాపిల్లకు నాగలేవేని
ముత్యాలపై నాస పుట్టంగనేల ?
పన్నీరుపువ్వును బడయ నెంచినను
ముల్లు దాకునటంచు నల్లాటమేమి ?
నీనీడ నెడఁబాయు నిఖిల యత్నములు
వ్యర్థమానని వేఱ వచియింప వలెనె ?

సన్న్యాసి

అట్లైన నోశిల్పి, యల్లవిగొ గనుము
భగ్నమై పడియున్న పడవచెక్కలను
యాత్రకు యోగ్యమానటుల జోడించి
తెరచాపలంగట్టి తెడ్లనందిమ్ము.

# మాతృమందిరము

[మాతృమందిర సందర్శన తత్పరులైన కొందఱు యాత్రికులు, కొండ నెత్తమున నొకనాఁటిరేయి గడపి, ప్రొద్దుపొడుపున మేల్కాందురు. కను చూపుదూరమున వారికి మాతృమందిరము కనుపట్టును.]

### మొదటి యాత్రికుఁడు

అవనీధరంబుపై ననిలడోలికల
నల్లనల్లన నూఁగు నంబుదార్భకులు
బంగారు కలలలోఁ బడి చిక్కుకొనిరి.
మంచుముత్తెపుఁ దెరలు చించి తొలఁగించి
పడకింటి కిటికీని బాగుగాఁ దెరచి
నవవధూతిలకంబు నాఁ దొంగిచూచు
దినరమామణి తూర్పు తీరంబు నందు.

### రెండవ యాత్రికుఁడు

విరిసెడి క్రొంబూల వింత నెత్తావి,
చుట్టుపట్టులనున్న సొగసైన గిరులు,
కర్ణపేయంబైన ఖగపాళిరుతము,
ఆనందజనకమై యలరు నిచ్చోట!

### మూఁడవ యాత్రికుఁడు

మాతృమందిరమున మంగళధ్వనులు,
బంగారు గంటలు పలికించురవము,
శంఖనినాదంబు, సామగానంబు
నాలకింపుఁడు; కాలహరణంబు తగదు.

### నాల్గవ యాత్రికుఁడు

అమలసౌరభ మీను నగరు ధూపంబు
కర్పూరఖండంబు గనిపించు త్యాగ
మాత్మలో వెలిగించు నమృతదీపంబు!

### ఐదవ యాత్రికుఁడు

అల్లదే! సోదర యాత్రికులార,
పర్వతశిఖరంబుపై మాతృమంది
రంబు సూర్యాంశుల రమణీయమగుచు
మణిమయ మకుటంబు మాదిరి దోఁచు.
పూజసల్పగ ఫల పుష్ప చయంబు
దోసిళ్ళఁ గొని తెచ్చి త్రోవపట్టుదము.
మందిర మార్గంబు మహితవృక్షముల
నీడలఁ జల్లగా నిదురించుచుండు.
పలువన్నెమణులను బఱచిన పోల్కి
రాలినపుష్పాల రాజిల్లు నేల.
సూర్యతాపంబున స్రుక్కక మున్న
మాతృసాన్నిధ్యంబు మనము చేరుదము.

### ఆ కా శ వా ణి

నిలుఁడోయి, నిలుఁడోయి, నిశ్చింతులార,
సత్యమెఱుఁగరు బాల్య చాపల్యమునను;

సరణి యెల్లను బుష్పసంకీర్ణ మనుచుఁ
జల్లనీడలఁ బోవు సమతలం బనుచు
భావించెదరుగాని పరిచితిలేమి,
నిదియె యాత్రికులఁ బరీక్షించు పథము!
మెఱసెడినదియెల్ల మేలిమిగాదు;
బాహ్యచిహ్నంబుల భక్తుఁడు గాఁడు;
ఎందరెందరో యాత్ర కేఁగుదెంచెదరు
విజయ మొందెడివాఁడు వేయింటి కొకఁడు.
అధమ లోహములెల్ల నగ్నిపుటాన
నంతరించును నొక్క యపరంజదక్క.
దుర్బలచిత్తులు దుష్టచేష్టితులు,
కార్యశూన్యులు మోసగాండ్రును జనులు,
మార్గమధ్యమునుండి మరలెదరుగాని
తిలకింపలేరు మందిర పుణ్యభూమి.
ధర్మజీవనుల పాదస్పర్శచేత
ననుదిన పావనంబైనదీ పథము!
ఆత్మసమర్పకులౌ వీరవరుల
యస్థులచేఁ బూతమైనదీ పథము!
త్యాగవ్రతుల శోణితప్రవాహముచేఁ
గడుగంగఁ బడినదీ కఠినంపు బథము!
దీని తత్వంబును దెలిసికోలేక,

యాటపట్టని యెంచి యరుదెంచినారె ?
భోగలాలసులార, పొందు మీపురికి.

[ఇంతలో దారిప్రక్కనఁ బడియున్న యొక పునుక యాత్రికులను జూచి, కలకల నవ్వి, యిటులఁ జెప్పసాగెను.]

పునుక

ఏండ్లు పూండ్లాయె మేమిచ్చోట నొరగి
దుమ్ము దుమారంబు తోట్లలనిండి
పుట్టగొడుగులు పచ్చపూరియు మొలిచె ;
మాయెమ్ములెచ్చోట మట్టిలోఁ జివుకు,
నచ్చోటఁ దీవియ లల్లి పుష్పించు ;
ఆసుమ మకరంద మానిన నరుఁడు
పరమవిజ్ఞానియై పరిఢవిల్లెడిని.
జననమొందిన యట్టె చావు నిశ్చితము ;
చావుబ్రదుకులు రెండు సమమె వీరునకు.
మాతృదేవి బలిమంటప మందు
యజ్ఞపశువుగ నిల్చు సంతతిభాగ్య
మెవనికి సిద్ధించు నిందఱిలోన,
నామహాపురుషుని యఱకాలిదుమ్ము
ప్రజలశిరం బెక్కి భస్మంబుసేయు ;
ఆతని కన్నులయం దుద్భవించు
బాష్పబిందులు దేవభాండారములను
వెలలేని ముత్యాల విధమున నుండు.

ఆయశస్వి చిరనామాక్షరపంక్తి
యప్సరోగేయమై యలరారుచుండు;
అధీరు క్రొన్నెత్తు అన్నిదిక్కులను
విజయాంకములు వ్రాసి వ్రేలాడఁగట్టు.
యాత్రికులార, మీ యందఱిలోన
నట్టి వీరుండున్న నడుగు పెట్టెండు.

[యాత్రికు లొకరి మొగ మొకరు చూచుకొని దిగాలుపడుదురు; కొందరు తలకొక్క దారిపట్టుదురు; మఱికొందరు వేషధారులు నోటఁ దడిలేక వెనుకంజవేయుదురు. ఇంక కొందరు దుర్బలహృదయులు అందఱికన్న మున్ముందుగ వెనుకకు మరలుటకు యత్నించి గిరిసానువునుండి కూలఁబడుదురు. కాని యొక్క యువకుఁడు మాత్రము, సజలనయనుండును, పులకిత శరీరుండును, పుష్పాంజలి బద్ధుండునై నిలుచుండి పునుక కిట్లు విన్నవించును.]

కడపటి యాత్రికుఁడు

ఆటపట్టగు నాకు నఖిల విశ్వంబు,
విశ్రామభూములై వెలయు గ్రహంబు,
లంగంబు చెండుగా నాటాడుచుండు!
విత్తు నశింపంగ వెలువడుఁ జెట్టు;
వత్తి కాలకయున్న వఱలునే కాంతి?
యభ్యుదయ హేతువై యలరుత్యాగంబు,
అట్టిత్యాగము నాకు నాదర్శకంబు!
బాధలే నాకాప్త బంధువర్గంబు;
బీదతనంబె నాప్రియమైన హక్కు;
లోకహితంబు నాలోచించు పనియె

కఠినంపువిధి ; దైవఘటితంబు నదియు.
స్వాతంత్ర్య రథమెక్కి సంసిద్ధుఁడనుగ
మునుకొంటి ; గుఱ్ఱాలఁ బూనింతునిపుడె
విజయాపజయములు విధిమూలకములు ;
యత్నంబె మనచేత నైన కార్యంబు.
మాతృపాదంబులం బడు భాగ్యమున్న
గిరులైన నన్నడ్డగింపఁ దరంబె ?
మార్గమధ్యంబున మడసితి నేని
మీవలె నెమ్ములు మేదినివైచి
నక్షత్రములలోన నటియించు చుందు.

పునుక

ఓయికుమార, నీయుత్త మాశయము
వెలిపుచ్చితివి త్యాగవీరుండ వీవు !
మాతృమందిర బలిమంటప వేది
నాత్మకర్పూరంబు నంటింప వోయి.

ఆకాశవాణి

పూజారి వాఁడుగో, పువ్వుటెత్తులను
దెచ్చి ద్వారముకడఁ దిలకించు వాఁడు.
కాలమమూల్యంబు, కదలు కుమార,
కాలిగుర్తు లనంతకాల సికతములఁ
బూర్వవీరులపోల్కి ముద్రించి పొమ్ము.

# హృదయాభిలాష

శ్రీగోపపాల, యాశ్రితభక్త జాల,
దివ్యవేణువినోది, దీన శరణ్య,
నలినాక్ష, నాజీవనంపుఁ బాత్రమున
నీగానసారంబు నిండింపుమయ్య.
ఆనందమున, నన్ను నంగంబుగరఁగి
గీతారసస్రుతి రీతి ననంత
కాలసాగరమునఁ గలసి పోయెదను.

విశ్వకావ్యకవీశ ! వేదాంతవేద్య,
విజ్ఞానమయమైన విస్ఫులింగమున
నంటింపు నాహృదయంపుఁ గప్పూరము.
నిరతంబు నీపాద నీరేజపీఠి
నత్తావిఁ జల్లుచు నేను వెల్గెదను.

ఓ జగజ్జ్యోతి ! నీ యుజ్జ్వలశోభ,
నామనో నేత్రంబునకుఁ దోఁపనిమ్ము,
కన్నులఁ బ్రమదాశ్రు కణములుదొరఁగి
పూజకుఁ బువ్వులై పోనగునో దేవ.

# భవిష్యద్దర్శనము

సందెముత్తైదువ, సరిగవలిపంబు
పరివెన్నపాపలు పట్టిలాగింగ
వాత్సల్యమునఁ బైకి నంగెనో యనఁగఁ
జెంగావి నిగ్గులు చేలపై నలమె.
ఈరామణీయక మీక్షించి యింటఁ
గాలునిలువక యూరి కడపటనున్న
పొలమున విహరింపఁ బోతినొంటరిగఁ.
దిన్నతిన్నగ వీచు తెమ్మెరలవలన
వెన్నలు బంగారు వీచులై తేఁగెఁ !
గాంతియు గానంబుఁ గలసి యనూహ్య
మగు నింద్రియవిషయమై కానిపించె.
అచ్ఛోట నానంద మనుభవించుచును
నొక్కింత కూర్చుండియుంటి నిశ్చలత.
అంతలోఁ గెంజాయ లంతరింపంగఁ
కప్పెను బ్రకృతి నక్షత్రసంఖచిత
కోమల తిమిరావగుంఠనాంబరము ;
గాలి వీచుటమానెఁ ; గదల వాకులును ;
అమ్మపేరెదనాడి యలసి కనుమోడ్చు
పసికూనలటు సరోవర మధ్యమందు
నిశ్చలశాంతిమై నిదురించు నలలు ;

గాంభీర్యమును దాల్చె గగనతలంబు ;
సగము జాగ్రదవస్థ, సగము స్వప్నమున
భావించుచును నెట్టుపైనఁ గూర్చుంటి.
సత్యమో, భ్రాంతియో, స్వప్నంబొ గాని
యింద్రజాలము వోలె నెదుటఁ గన్పట్టె.
నది సత్యమైయున్న నాశ్చర్యకరము !
అది కలయేయైన నానందమయము !

*　　*　　*　　*

మామిడితోఁటను బర్ణమంటపమందు
జనరంజకంబైన సభ యొండు జరిగె.
మొగిలిరేకులు తమ్మిపూఁదోరణంబు
లందంబు నెత్తావి పర్వించుచుండె.
రారాజు క్రొంబచ్చతాఁ గద్దెడిగ్గి
యందటికిఁ బోలె యవనిఁ గూర్చుండెఁ ;
బనిపాటు లేనట్టి బంటుసిపాయి
త్రుప్పుపట్టినకత్తి పంటిపై రాయఁ
దనపూర్వ జయములఁ దలపోయుచుండె ;
బురదచిట్టలుపడ్డ పుట్టములఁ గాఁపు
వర్తించె నృపపరివారంబుఁ గలసి ;
కూలినాలి యొనర్చి కుడుచు నిరుపేద
యజమాని సరిబంతి నాసీనుఁడయ్యె.

సకల మానవజాతి సంతతులు కుల
వర్ణ భేదంబులఁ బాటింపఁ బోక
నొక్క కడుపునఁ బుట్టి యొకచన్నుఁ బాలు
ద్రావినరీతి సౌదర్యంబు గలిగి
యన్యోన్య సాహాయ్య మర్థించువారు.
స్ఫటికపాత్రంబున శాంత్యాసవంబు
ధర్మదేవత తెచ్చి తనిపె నందఱిని ;
నేక కుటుంబమై యీప్రపంచంబు
స్వర్గంబు భూమిపై స్థాపింపఁ బడియె.
అభ్యుదయాంశువు లన్నిమూలలను
నవనవోజ్జ్వల జీవనంపు దీపముల
వెలిగించుచుండె ; నీ విశ్వమంతయును
మానవకళ్యాణ మందిరం బయ్యె.
అంతలో లౌకిక యాథార్థ్యములను
భావంబు వ్రాలెను బక్షివిధాన ;
బొగ్గుకంబము లట్లు పొడకట్టుచుండెఁ
దత్ప్రాంతముల నున్న తాళవృక్షములు !
చిమ్మచీఁకటి నోంటఁ జిక్కుకొనియుంట.

# సమరతృష్ణ

సంగరతృష్ణచే స్వాంతంబు రగులఁ
బటుదురాశావేశ పారవశ్యమున
నధికారదాసులై యవనిఁ బీడించు
మనుజసంతతులార, కనికరము లేక
బలహీన జాతులఁ బట్టిచంపెదరు.
దేహంబు నలుపైనఁ దెలుపు పసుపైన
నాత్మబంధులుగారె యఖిలజనంబు?
కామంబు, క్రోధంబు, గర్వంబు, జాతి,
దేశంబు, భాషయన్ దెరలు చింపంగ
సర్వసామాన్యమై చను మానవత్వ
మొక్కతీరున గాక యున్నె వేర్వేఱ?
మానవరక్త సంభార విక్రయము
గావించు నక్రైస్తు ఘాతుకులార!
విజయమదిరాపాన వీతచిత్తమున
నేల పావనమూర్తి నేసుమహాత్ము
మఱియొక్కమాఱు కర్మాగారపంక్తి
చిమినీలపైకీడ్చి సిలువ వేసెదరు?
నిస్సహాయయు దాస్యనిగళబద్ధయును
నగు నమాయికజాతి యస్థిపునాదిఁ
గనకమందిరములఁ గట్టుచున్నారె?

యూలపోయెడివారి యుడుకు నిట్టూర్పు
విసరదే మీఁచితి వేడిమంటలను ?
సొంతయక్కఱకన్న నెంతో యెక్కుడుగ
వస్తుల నిర్మించి వానివెల పెచ్చు
జనసంఘముల బానిసలుగఁ జేయుదురె ?
యిట్టియన్యాయ మింకెంతకాలంబు
అపును గాదనకుండ రవ్వలుకోసఁ గలదు.
ఐశ్వర్యవంతుల యఱచేతి ఫలమ !
కష్టజీవుల పాలి కంఠపాశంబ !
ఓనాగరకత ! నీయున్నతాదర్శ
మిదియె ప్రయియుండిన నింకఁ జాల్చాలు !
మానవహృదయమ్ము మంటవెట్టకుము.
చీఁకట్లు పెనుగాలిఁ జిమ్ముతెక్కలను
భూమిపై పైఁగప్పి పొదుగంగఁబోకు
కాలకూటజ్వాల గ్రక్కుసర్పముల.
వాణిజ్య దేవతా, వాయుసామ్రాజ్య
మందుఁ జరించు మాయల మంత్రకత్తె !
అతిదురాశా తృషఁ బతితులౌ జనుల
బంగారు పానలకుఁ బట్టిబంధించి
కొండలం గానల గోనల గుహాల
మింటను మంటను వెంటఁజీత్కాడ

నీడ్చికోఁ బోయెద వేమి నీ మహిమ !
నీపాదచిహ్నాల రాపాడి వచ్చు
సంగరపశుశక్తి చచ్చిచావకయు
యాత్మకృతాపరాధాంకితై నిలిచి
బహుళశరశ్చిత్తప్త బాష్పపూరములఁ
దవ మనోవికృతుల దాహంబుఁ దీర్చు.
శాంతి నానాజాతి సమితి చేకూర్పఁ
జాలునే చిత్తముల సలసలం గ్రాగు
పాషాణరసములు పైకిఁ బొంగింగి ?
సమరపరాజిత శత్రువర్గముల
కొల్ల ద్రవ్యము పంచుకొను వేడ్కఁ బెద్ద
భాగంబులకుఁ బోరు "పరమ సౌహార్ద
చక్రవర్తుల" కేల శాంతిపీఠము !
ఖండాంతరంబుల కపటనాటకము,
కాలమెప్పటికైనఁ గనికరము లేక
నీ ముసుంగును జీల్చి నిజరూపుఁ జూపు.

భావిసంగరముష్టిఁ బట్టుపడనిక
జగతినిఁ గాపాడ సకలదేశముల
కవిమహాశయు లొక్కకట్టుగావలయు.
ఇదియె నాస్వప్నంబు; నిదియె నాయాశ.
కలయు నిక్కంబగు కాలంబు రాదె !

ఓ కవివరులార, యో జగదేక
శాంతి దాయకులార, సర్వజనీన
సేవాసమాసక్త చిత్తాబ్జులార,
అల్లదే, దర్శించుఁ డవతరించెడిని
ఆధ్యాత్మికయుగంబు; నానందమఖము!
జ్ఞానహేమాగ్ని యీ కరదీపికలను
వెలిగించి, జెండాలు వినువీథినెగుర
నఖిలమానవ హృదయధ్వంసి కీట
కములకుఁ దల్లియౌఁ గటికదురాశ
సమయింప సంగ్రామ సన్నద్ధులగుఁడు.
అదిగో దివ్యాహ్వాన మభ్రమున వినుఁడు.
నిభృతశాంత కుటీర నీడములనుండి
కవికోకిలములార, గగనంబు గనుఁడు.
ఎంతవిశాలమై యెంత గాంభీర్య
రామణీయకముల రాజిల్లునదియొ!
లేలెండు తఱియిదే లెండు సఖులార!

# * మేలుకొలుపు

మేలుకో భారతకుమారా,
మేలుకోరా తరుణధీరా,
మేలుకో!

కష్టనిర్భర దాస్యముట్టగాలఁ
గాఢచీకఁటి సడలిపోయెను,
భావి ప్రత్యూషమును జాఁటగ
వాఁడుగో శుక్రుఁడురహించెను,
మేలుకో!

మంగళ ధ్వనులఁగల పక్షులు
మంజులాలాపములు సల్పెను,
మాతృభూమి జయాంకమై రవి
మండలం బుదయించెఁ దూర్పున,
మేలుకో!

మేలుకో భారతకుమారా,
మేలుకోరా తరుణధీరా,
మేలుకో!

# వానకాలపు పరిచేలు

క్రొక్కాఱు మబ్బులు గుంపులుగూడి
యాకసంబునఁ దేలు నట్టి తఱుణమునఁ
బసినాఁటి యానంద రసము పొంగఁగఁ
బలుమాఱుఁ గాంచితిఁ బచ్చవరిచేలు !
వానముత్తైసరాల వలముసుఁగుఁ దాల్చి
దినలక్ష్మి కోమల దీధితులు చిల్క ;
జల్లులం దడిసిన సస్యపుంజంబు
దుమ్ముకప్పందొఱంగి తొలఁకాడెఁ గాంతి ;
గాలిలోఁ దడిపచ్చికల తావి విరిసెఁ ;
బొగవన్నె మబ్బుపై నెగిరెడి కొంగ
బారు, భౌతికరూప బంధంబు లెడపి
పుణ్యలోకముఁ జేరు ముక్తాత్మ మాల
యన భావవీథిఁ దోఁచెను విచిత్రముగ.
వానచినుకులు సేయు గానంబు నేఁడు
అఖిల లీలామనోహరమైన బాల్య
కాలంపు స్వప్నంబుఁ గనులఁగట్టించు
నింద్రజాలమురీతి నిగురొత్తఁ జేసె
నెన్నఁడో మఱచిన పిన్నతనంపుఁ
బారపొచ్చెములు లేని బుజ్జికోరికెల.

# హతాశ

---

అర్ధరాత్రపువేళ, సంబరవీధిఁ
దారలు వికసించు తరుణంబునందు,
స్వర్ణమయంబైన స్వప్నమోహమున
మానవలోకంబు మగ్నమైనపుడు,
ఒంటిగావచ్చి నాయుటజంబు కడకుఁ
దలుపుఁ దట్టుమటంచుఁ జెలికిఁ జెప్పితిని.
'అల్లెపో'యని తలయాడించె సకియు.
రెండుజాములు దాఁటె రెండేండ్ల పగిది,
వేచియుంటిని——నా పసిగి వేసారె;
నింకైన నరుదేర దేమి కారణమొ?
రమణి దగ్గఱలేని రాత్రులయందుఁ
గడతెంపగారాని కాలభారంబు
సీసంపుగోలుసునాఁ జిత్తాంతరమున
వ్రేలెడి నిసి!—యెట్లు వేగింతు నిశను?
ఇంక మాకుఁ బరస్పరేక్షణప్రాప్తి
గలుగుటనిజమేని, కన్నీటిబొట్ల
మాలను రచియించి మాయలమారి
చేడియకర్పించి శిక్షగావింతు.
నాయవివేకంబు నాకుఁ దోపింప
నరుణుండు తూర్పున నావిర్భవించెఁ;

E

బాలఁతిరానూవచ్చెఁ బోవనుంబోయెఁ !
బచ్చిలత్తుకపూఁతఁ బైదలియడుగు
ముద్రలు వాకిటి ముంగలం దనరె !
సకియ మేలిముసుంగు సందడి వినియుఁ
బవనకంపిత పర్ణరవ మనుకొంటిఁ.
బ్రేయసిచేతి దీపికకాంతిఁ గాంచి
యనలతారాశోభ యని భ్రాంతిపడితి ;
నెంత ముగ్ధుఁడనైతి ! నెంతపొరపడితి !
ఆభిశప్త జీవుండైన నేనెడ ?
సకియ కంఠాశ్లేష సౌఖ్యమునన్నెడ ?

# శైశవస్మృతి

శైశవస్మృతి ! యిహస్వర్గానుభూతి !
వానమబ్బులపై సవారిచేయుచును
వర్షాగమంబున వచ్చితే నీవు !
నవసెడి మనచిన్ననాఁటి నేస్తముల
వాన చినుకులుసల్పు గానములగుండఁ
జెవిలోన గుసగుస చెప్పుచున్నావె ?
అల్లిబిల్లులు తిరుగ, నాటలాడంగ,
వాఁగులై వీథులఁ బ్రవహించునీటఁ
గాళ్లడ్డముగఁ బెట్టి కట్టలుగట్టఁ
బ్రతి వానకాలంబు బాల్యంబుఁదాల్ప
నిల్ల మువ్వేళ నువిళ్లూరుచుండు !
ఉల్లాసమున నాడు నో మబ్బులార,
జ్ఞప్తిలేదా మీకు నాముద్దుమొగము—
మఱుమాయలెఱుఁగని మందహాసములఁ
జిందు సుకుమారంపుఁ జిన్నారి మొగము
భావింపలేరె నా పసినాఁటి కనుల—
ఆశ్చర్య మిళిత దివ్యానందమునను
మిమ్ముఁ గన్నట్టి యాకమ్మని కనుల ?
మఱవరు గద నాదు చిఱుకేలుగవను—
ప్రొద్దు నిగ్గులు పైడి పూఁత పూయంగ

సరిగపేటు విధాన మెఱయు మీయంచు
జాలరుం బడయు కోసము చాపి చాపి
పలుమాఱు వేసట పడిన కేల్గవను ?
అట్టి శైశవ మిప్పుడలరునే నాకు ?
బాల్యంబుగడచె; యౌవనమంకురించె;
నిరువది యేండ్లు జరిగె నిప్పటికి.
అంబరచరులార ! యంబుదములార,
యేదానధర్మంబు లేజపతపముఁ
బూర్వజన్మంబునఁ బొనరించి నారో,
యిట్టి నిర్మలవృత్తి యిట్టి జీవనము
నెడలేని శైశవం బీపుట్టు వందుఁ
బడసినారలు మీరు పావనాత్మకులు !
కాల హాలంబు నా కనుబొమలపైన
నడ్డచాళులు దున్నె ; నైనమీరేమొ
పసినాఁటి చిన్నారి ప్రాయంబు విడక
యనుదిన నవ్యులై యలరుచుండెదరు !
మిన్నునఁ జరియించు మిమ్ముఁ గన్నపుడు
నావయస్సు గియస్సు భావింపఁ బోక,
వానచిన్కుల నాడ వలతునే గాని
పరుల యాడికలకు భయపడి, యింటఁ
బట్టి బంధించిన పగిది నుండెదను.

## మేఘములు

ఓమిత్రమా, విధికుమ్మ్లింపకుము
ఇంట నీవుండిన నేమి, నీయెడఁద
పిన్నటవలె మాకు బిగి కౌఁగిలింత
స్పర్శా సుఖంబును బడయుట లేదె?
కాల దార్జ్యంబు కాయమును దక్క-
నీహృదయం బంటనే యంట లేదు;
ఓయి బాల్యసఖుండ, పోయివచ్చెదము,
మరల యేడాదికి మనకు దర్శనము.

# అభిసారిక

మల్లెపూవుల దండ లల్లుసుకుమారి!
పరవశంబైన భావంబున మఱచి
యేలపూరేకుల నిట్లు చిదిపెదవు?
కడుమెత్తనైన నీ కన్నెమనంబు
నెవ్వాఁడు హరియించె నీ నిశీథమున!
ఈ పూవుఁ బొదరింటి కేఁగదనంచు
బాసచేసె ప్రియుండు మోసగించెడినో?
యటుగాక, నీమృణాలాంతరంగమును
బిడించు వేదన వెలియార్ప నొక్కఁ
నిర్జనశాంతంబు నిభృతంబునైన
స్థలమునుగోరి యిచ్చటకు వచ్చితివో?
ప్రణయ దీపము వెల్గి బాట గాన్పింప
నర్థరాత్రమునందు నభిసరించితివో?
నీయంద చందంబు నీనీటు గోటు
నీ ముద్దు మురిపెంబు నీవిలాసంబు
నెంతవ్యర్థంబాయె నింతిగో నేఁడు!
చెమరించు నీమోము చిన్నెలయందుఁ
బ్రతిఫలించు నగాధ భావఘూర్ణణము!
భగ్నాశ నీవిటు పరితపింపంగ
నెడలేక దొరఁగిన కడఁగంటినీటఁ
దడిసెనీవు రచించుదండ, పూఁబోఁడి!
తన నేతఁ దలపోసి తలవంచు కొనఁగఁ
బ్రొద్దువొడుపున నీపువ్వుల మాలఁ
బ్రేమదూతియనంగిఁ బ్రియునకుఁ బంపి
మంచికాలము రాక మదినెంచి కొనుము.

# గఱిక

---

దారికోవల క్రేవఁ దనరారు గఱిక !
యెంతమొత్తందన మెంతటి ప్రోది
యెంతక్రొత్తందన మిగురొత్త నీవు
మొన్నగాఁ గురిసిన ముత్యాల జడికి
మురిపాల గుబురువై పెరుగుచున్నావె ?
దైవ సృష్టిని నీకుఁ దావొందుగలదు.
నేను నీపైన నెనరూనియుందు.
ఏను నీవైతినో యెవరికిం దెలియు
మున్ను గతించిన పుట్టువులందు !
ఈవు నేనౌదువో యెవ రెఱుంగుదురు
రాఁబోవుజన్మాల రాకపోకలకు !
గుసగుస చెప్పెదు ; గునిసి యాడెదవు.
నీలోన వెలిగెడు నిర్మలజ్యోతి
వెలికొత్తఁబోరాట పెట్టుచున్నదియె ?
నీయందచందంబు నీసంతసంబు
నందుఁ బాల్గొన నాదు డెందముప్పొంగు !
పంచవన్నె ముసుంగు వలిపంబుక్రింద
నొకవేళ నిరువుర మొకరమే యేమొ !

---

# దీపనిర్వాణము

ఏదిక్కుఁ జూచిన నిసుక యెడారి !
నిబిడాంధకారంబు ! నిస్స్వనతలము !
జగతి గర్భంబెల్ల చైతన్యరహిత
గంభీరశూన్యమై కనుపట్టుచుండె.
నొంటిగా నేనొక్క యొంటెపై నెక్కి
యీబయలు తరింప నేఁగుచున్నాఁడ.
రేయిఁబాంధునకు దారిని జూపుచుక్క
లాకసంబున నెందు నగపడవేమొ !
ఒంటెగిట్టల చప్పుడొకటియుఁ, గాలి
నిట్టూర్పు సడిదప్ప నిశ్శబ్దవీథి
వేఱుసందడియెందు వినులఁ బడదు.
హృదయదౌర్బల్యంబు వదలించి నూత్న
నోత్సాహముంగొల్ప నొక్కకోకిలయు
నమృతతుల్యంబైన యానందగీతిఁ
బాడదక్కట ! నాదు పాపమేమంచు.
పలుమాఱు నాచేతి బంగారుదివ్వె
వెలిగింతుఁగాని, కంపిలి యానిమేష
మందె పయ్యెర వీచి యాఱిపోయెడిని !
వెలిగించి వెలిగించి విసిగివేసారి,
పెనుదుపానుకరళ్ళ గునిసి త్రుళ్ళింత
లాడు చుక్కానిలేనట్టి పోతంబు
తీరున, వీధియీడ్చు తెఱుఁగులనెల్ల
ధూళిబ్రుంగుచు నేఁడు ద్రొక్కుచున్నాఁడ.

# వీణాప్రియ

తంత్రులు దెగిన నాధ్యానవిపంచి
విశ్వమోహనగీతి వెలికూర్పు నీదు
వీణ తంత్రులు వేసి బిగియించి మర్మ
నీరవమూర్ఛన నెఱపించు శ్రుతికి
మేళగించి, రహస్య కేళిగృహంబు
నకుఁ బంపుఁడని ప్రేమ నా ప్రాణపతికిఁ
జెప్పిపంపితి దూతిచే నొకనాఁడు.
ఎన్నియో దినములు నేండ్లును బూండ్లు
గలసిపోయె ననంత కాలశూన్యమున !
హృదయేశుఁ డేమొ నా వదనంబుఁ గనఁడు,
వీణయుం బంపఁడు, వినిపింపఁ డెట్టి
వార్తయునైన ; నాపాప మెట్టిదియొ !
నాగానగర్వంబు నాసోయగంబు
నాభూషణప్రీతి, నావచోరీతి
నాయభిమానంబు, నాగౌరవంబు,
నాదు కౌలీనంబు నాసిగ్గుసెరను
తొలఁగి, మేలిముసుంగు వలిపెంబు దిగిచి
యంతఃపురము వీడి యలజడికోర్చి
బిచ్చకత్తైవిధానఁ బృథ్వి యెల్లెడల

దుమ్ముదుమారంబు గ్రమ్మినచీర
ధరియించి త్రిమ్మరు తరుణంబునందు
నాప్రాణనాథుండు నామనోహరుఁడు
వనకుటీరంబున వసియించి నన్ను
'రమ్ము నాకోర్కెలరాణి! రమ్మిటకు
నిపుడర్హవైతివి యీఁదివ్య వీణ
సారింపరమ్ము నాసరస గూర్చుండి,'
యని తియ్యగాఁబల్కి యానందబాష్ప
ములు కన్నులఁ జారంగ ముద్దాడెనన్ను

---

# * సేవ

మముగన్న భారతమాత మందిరమున
దివ్వెలై మనముందామా, పైడి
దివ్వెలై మనముందామా.

పరమ పావని తల్లి పాదపూజలవాడు
పువ్వులై మనముందామా, పొన్న
పువ్వులై మనముందామా.

భారతీదేవి విపంచిక రవళించు
తంత్రులై మనముందామా, దివ్య
తంత్రులై మనముందామా.

జన్మభూమీశౌర్య సౌరభ్యములుచల్లు
గీతలై మనముందామా, భావ
గీతలై మనముందామా.

కదనవీరులచేతి ఖడ్గ ధారలలోని
మెఱుపులై మనముందామా, కాఱు
మెఱుపులై మనముందామా.

# * ప్రబోధశంఖము

ఏల తెలియక సంశయించెదవు
భారతకుమారా !
డీలుపడి వెనుకంజ వేసెదవు ?
విన్నదనమున మోమువాల్చెదవు
దాసోఽహ మనుచును
జిన్నతనమునఁ గేలుమోడ్చెదవు!
తెల్లచర్మము నీకు లేదనియో,
బలమైనవాశులఁ
బెల్లునెత్తురు పాఱ లేదనియో ;
భారతీయుఁడ ననెడి గర్వమునఁ
దలయెత్తి నిక్క-
తేఱిచూడుము సకల లోకమును.
ఎంతకాలము స్వప్నసింహంబు
దడిపించు నిన్ను
జింతసేయుము ; తొలఁగు మోహంబు.
ఏలనోయీ గద్గద స్వనము,
ఆక్రోశగానము
చాలుచాలిఁక విఫల యాచనము !
వీరపూజోత్సవపు సమయమునఁ
బూరింపవెమ్ము
ఘోరభీషణ విజయశంఖమును.
ఏల తెలియక సంశయించెదవు
భారతకుమారా !
డీలుపడి వెనుకంజ వేసెదవు.

## *రజని

నిర్మల నీల నభంబునఁ జుక్కలు
నిండె సజీవ వికాసములన్ ;
మర్మ విపంచిక నీరవ రజనీ
మానిని మీటెను మూర్ఛనలన్.
ప్రాంత కుటీర లతాద్రుమ సౌధము
లస్ఫుటతారా కాంతిన్
వింతగఁ గిరఁగిడి వోయిన ఛాయా
క్రాంతములై కనుపట్టెన్ ;
నిశ్చలశాంతిని నిఖిల జగతి సుఖ
నిశ్వాసము వెడలించున్ ;
నిశ్చల నిబిడ గభీరానందము
నిండి పొంగె లోకమునన్ ;
దైనిక కలకల మూర్ఛితభావము
తారా శిశిర స్పర్శన్
మానస గగనమునందు విహంగము
మాదిరి నెగిరెఁ బ్రబుద్ధంబై.
గోరీపై నిప్రదీపిక యట్టులఁ
గూర్చుంటిని నే నొంటరిగన్
సారెకు జాగ్రత్స్వప్నమునందుఁ బ్ర
సక్తుఁడనై మఱిమేల్కాంచున్.
అహాహా! నామది విశ్వముతోడ ల
యాన్వితమై నటియించున్
అహాహా! విశ్వము నాహృత్పాత్రిక
నాసవ రసమున లయమొందున్.

# * అభిసారిక

గాలియడుగుల నెవరి కోసరము
ఓ మోహశీలా!
కదలివచ్చితి వీనిశీథమున?
కాలియందెలు ఘల్లుమనుననియొ
ఓ వలపురాణీ!
కేలఁ గైకొని మెల్ల నడచెదవు.
పులుగుతుటుము తటాన కీచనుచు
అరగూర్కు గూళులఁ
బలుక, వెఱపున దెసలు గాంచెదవు
నిలిచి యేమని యాలకించెదవు,
నీయడుగుసడి కే
యులికిపడి "యెవర"నుచు మఱలెదవు!
తెల్ల వెన్నెల నీ దుకూలంబు
మైపూఁతనిగ్గులు
తెలియరావని యూహ సల్పెదవు.
నీవు నడచెడి బాటయెల్లెడల
వ్యాపించు గందపుఁ
దావులెట్టుల గప్పిపుచ్చెదవు?
ఓ ముద్దరాలా!
నీ విహారము బయలు పఱచెదవు.

# * ఆగంతుకి

చాలులజ్జామధురవినయము !
ఏల యవగుంఠనమువైచెదు
పూలదండలుగట్టియుఁ మెడఁ
గీలుకొల్పక కేలఁ జిదిపెదు
శోభినీ !
యప్సరఃకామినీ !

సందెవేళలఁ బూలతేఁకులు
క్రింది కురలఁగఁ గాంచికాంచి మ
రందబిందులు కన్నుఁ దమ్ములఁ
జిందఁ బొగిలెదు ప్రకృతిచేష్టకు,
కామినీ !
సుందరగామినీ !

పలుకరించినఁ బలుకవేమొ !
పులుకుఁ బులుకునఁజూచి, చూపుల
వెలువరించెదు లలితహృదయా
విల కఠోర వ్యసనభారము !
ఏలనే ?
మౌనంబేలనే ?

ఎపుడు మౌనవ్రతపు టుద్యా
సపు దినంబులు వచ్చుఁ గోమలి !

యెప్పుడు విరియునో మూకసందే
శపు నిలీన రహస్య భావము ;
పోలునే,
చింతన చాలునే ?

తేలివచ్చెడి కల విధంబునఁ
గాలియడుగులు సందడింపక
యేల వచ్చితివీ వసంత వి
నీల గగన చ్ఛాయనొంటిగఁ ;
బలుకవే
భావముఁ దెలుపవే.

చీఁకటులు బలమయ్యెఁ ; జుక్కల
రాక పోకలనేల తలఁచెదు
నా కుటీరమునందు వెన్నెల
పోకి తమము నశింప దీపము
పెట్టవే
నామ్రగి ముట్టవే.

---

# పిచ్చిబికారి

---

### మాయాకుమారి

ఓయి యాగంతుకా, ఓయివిరాగి !
పాములు వ్రేలాడు పగిడిజడివాన
కుమ్మరిల నెడలేక కుండపోఁతలుగ,
ఝంఝామరుత్పక్ష చాలితంబగుచుఁ
బెనఁబడి చెట్లెల్లఁ బెల్లగిలికూల
గన్నుపొడిచిన యట్లు కాఱుచీఁకట్లు
నలుగడవ్యాపింపఁ, బలుమాఱు మెఱుఁగు
తీఁగలవెల్గునఁ దీవ్రతరఘోర
ఘాతికోన్మత్త దుర్వార ఖేలనము
కనులకు వ్రేగయి కనిపింపనేమి
బిచ్చంబుఁగోరి యీ వెఱగొల్పురాత్రి
వచ్చితివొంటిగా పిచ్చిబికారి ?

### బికారి

ఓ యైంద్రజాలిక మాయాకుమారి !
ప్రళయలీలోద్ధృత ప్రకృతిసంగ్రామ

భూమి సింహాసనంబునఁ గొల్వుదీరి
యచలప్రదీపిక యటుల వెల్గు నిన్ను
నివ్వేళగాక నే నెవ్వేళఁగందు.
నీచేతిభిక్షకై నిఖిలంబువిడచి
కాలవీథిని నొంటిఁ గదలివచ్చితిని.
నీపాదములకడ నిలిచి వేడెదను ;
నీ తేనె చిఱునవ్వు నెఱపి "కొమ్మ"నుచు
బిచ్చంబుపెట్టుము ప్రేమమై రమణి!

మాయాకుమారి

యేమిబిచ్చంబోయి, యీనిశీథమున ?
ఉత్తచేతులరాణి; నిత్తఱినీకు
నేమియ్యఁగలను ?

బికారి

ఇం కేమికావలయు ?
నీజడకట్టులో నిద్దురవాడి
నలఁగిన చంపక దళములమాల
బిచ్చంబుపెట్టుమీ పిచ్చిబికారి
సంతృప్తినొందును ; జాలించుయాత్ర.

# * బాష్ప దౌత్యము

---

జీవనగంగా హారితతటంబునఁ
            జింతా వటతరు మూలమునన్,
ఏల యధోముఖివై గడతెంచెద
            విస్మృత యౌవన నిశలన్ ?
ఆవలిగట్టున స్వప్నపురంబున
            నవ్యానునిర్వృతి వనులన్
డోలాఖేలన రతుఁడౌ ప్రియునిఁ గ
            నుంగొను భావన సల్పెదవో?
నీవయసెల్ల హృదీశునిఁ జింతన
            నిర్మాల్యారోపము పగిదిన్
గాలెడి నబలా, నీయౌవనవల్లులు
            గందిముఁ జిమ్ముచు నల్గడలన్.
ధావమాన శరదంబుద శకలపు
            దౌత్యము నమ్మెటు వేచెదవే ?
చాలునిరీక్షణ ! చాలిఁకఁ జింతన !
            చాలురహస్య వియోగహతుల్.
జీవనసంధ్యా పరిణతబాష్ప స
            చేతన నిరవ దూతికలన్

గాలపయోనిధిఁ బర్ణపుటంబులఁ
గదలింపుము ప్రియుకడకున్.
హా! విధివశ్యతఁ జేరుదురవ్వలి
యంబరచుంబితటంబున్.
బాలతపస్విని! యెపుడే వేళను
వల్లభుఁ డొసఁగును దర్శనమున్,
శ్రావణ నీరదమాలిక లిరువురి
శయ్యాడోలికలై యూఁగన్.

# * అతిథి

తెఱచియుంచితిని జీవనమందిర ద్వారంబుఁ
దీర్ఘవాసీ! కొనుమాతిథేయ సత్కారంబు.
ఓయాత్రికా! ఓనక్షత్రమండలపథికా!
యే యజ్ఞాతసాగర శాంత తట తరువీథి
నేయానందకూల సమీరణ శిశిరచ్ఛాయ
నేకాకివై తిరిగితివోయి, నిశాముఖ వేళ?
ఏ యలౌకికమార్గసముత్థిత కాంచనధూళి
నీ జీర్ణవస్త్రమిటు కావిరిపట్టె బికారి!
ఏ నిగూఢ విపంచీరాగము వింటివో గాని
ఏ చిన్మయానుభవస్వప్నముఁ గంటివో గాని
యిటు విహారించెదు ముక్తపథంబున నతిథీ!

# * మోహినీ ప్రకృతి

జిలిబిలి తియ్యని రాగములెత్తి చేసెనుగానము సెలయేఱు ;
తళతళవెన్నల నిగ్గుల నలలుం దాండవమాడెను మైమఱచి;
కలకల కోకిలరవములు రజని గాంభీర్యమునకుఁ దోడ్పడియె;
జలజల దేహము పులకించి వ్రేళులు జాఱెను వీణాతంత్రులను.

ఓరె! నాజీవన శుష్కఝురంబు
పాఱెఁ గూలంకష పూర్ణముగ ;
జాఱెరా, పరలోక జీర్ణతటంబు
పూరసంఘర్షణ శీర్ణముగ !

పగలిఁ గమండలుపాత్రిక !
చిగిరించె సంసారవల్లిక !
తగదిఁక బైరాగి జీవిక !
జగమెల్ల నందనవాటిక !

# * జీవన వ్యాప్తి

---

యామిని

ఏడకయ్యా చిన్నవాఁడా,
కోడెప్రాయపు వన్నెకాఁడా,
యేఁగెదవు నడిరేయి వెలుపటి
వాఁగువఱ్ఱుల దారివంకకు ;
ఏలరా ?
యీవింతనడవడి చాలురా.

ఆకసంబునఁ జుక్కదివ్వెలు
చీఁకటులఁ గడు బలుచ చేయగ
జీవలోకము చల్లనిద్దురఁ
గేవలము మైమఱచి తేలగఁ
దల్పముల్
విడి తిరుగఁ గారణమేమిరా ?

కన్నుబొమ్మలు వంగిసొంపఱ
చిన్నవోయిన చిన్నెలొలికెడి
నెట్టివేదన లెట్టిచింతన
లిట్టితఱిఁ జెలరేఁగె మదిలోఁ,

దెల్పరా,
నాయెదనెత్తురు లొల్కెరా.

జీ వ న ద్వే షి

ఓసి వలపుల రేయిసానీ!
ఓసి కల్వల సిగుల రాణీ!
విసిగి వేసరి జీవబంధన
విసరమును దెగ దెంపవచ్చితిఁ
గావవే,
జేనెదు తలంబునుజూంపవే.

యా మి ని

ఓయి ప్రాయపు టందగాఁడా!
ఓయి ముద్దుల మురిపెగాఁడా!
ఏలయంటెర చీడపుర్వు వి
శాలజీవన పుష్పదళముల?
మానరా,
యీపిచ్చియత్నం బేలరా?
సరసినీటను బ్రాణములు విడఁ
దరలుటయె నిజమేనిఁ జెప్పుము—
నాదుహృదయం బంతకన్న న
గాధ, మందు మునింగితాపముఁ

వాపరా,
నీ విసుగు వేసట లడఁగురా.

నేలపై నీతనువుఁ బాపుట
చాల యిష్టంబేనిఁ జెప్పుము—
నాదు మెత్తని రొమ్ముతలగడ
నాదరంబున మోమునానిచి
తూఁగరా,
యెడలేనియూరట నొందరా.

జీవనము నుఱ్ఱాటనీడ్చుట
నీవు తలఁచెదవేనిఁ జెప్పుము—
జడను సలఁగియుఁ గమ్మతావులఁ
గడలఁజిమ్మెడు పూలదండను
నిత్తురా,
మరణాభిలాషము మానరా.

# * ఆనందసత్రము

ఈవసంత యౌవన రజని
నీమృదు తారాకాంతిఁ
బార హీన గంభీర జలధి
వాయు తరంగాహతుల
మ్రోగెరా నాదుహృదయమురళి
మోహన గీతాగతుల !
ఆడెరా నా జీవనపాత్ర
నానందఫేనిల మదిర !
విరిసెరా నా భావమునందు
విశ్వజనీనానుభూతి !
ఆహా ! యీ మనోహర రాత్రి
నైతి ననంత సృష్టి.
ఓరే ! విరహ విహ్వలకామి !
ఓరే, దరిద్రకుచేల,
ఓరే ! నిష్ఠురజీవన పథిక,
ఓరే, మానవద్వేషి,
రండిరా, రారండి హిమకర
రంజిత గగనచ్ఛాయ
నానంద సత్రద్వారములు
నన్నింటిఁ దెఱచితి రండి !
అతిథులారా, చెలియొకపాత్ర
యాసవరస మానెదము
ఆమత్తులోనఁ గరఁగిపోవు
నైహికయాత్రా శ్రమము.

## * ఆమనినిషా

జాగ్రత్త! జాగ్రత్త! మాయజగత్తని
            శాస్త్రము లెల్లను విప్పెదవు;
భాగ్యము భోగము చంచల మంచును
            వైరాగి ధర్మముఁ జెప్పెదవు;
ఎవ్వారు విందురీ పిచ్చి బోధనము
            లీమధుమాస నిశీధమున?
ద్రాక్షరసాయన పాత్రిక పెదవులఁ
            దవులఁ దలంతురె చేదనుచు?
ఓయి, యతీశ్వర, చాలిక బోధన
            మూరక తెల్పకు నీమతము.
ఆనంద భాండమునందు హాలాహల
            మున్నదొయ్యొ! విరసుండ, కలుషితము.
ఉన్మత్త కోకిల గానము సల్పెడు
            నుద్యాన వాటిక మధురముగ.
పొడవాటి లొద్దుగ కొమ్మలు నూగఁగ
            బుష్పము చిందెరుఁ గుమ్మ్యాలలు.
ఆమనినుత్తున చైతన్యలోకము
            ఆనంద పరవశ్యము సాగియు;
సరిచేయుమో సఖి! భగ్న విపంచిక
            సంధ్యాలు పాటలఁ బుచ్చెదము!
సౌఖ్యనదీరసపూరమునందుంచ
            జంట విధంబున నీదుదము!

## * లూటీ

ఎవరురా నా వీణా తంత్రుల
నిట్టుల సళ్లించి పెట్టిరి !
ఎవరురా నా గంగా తీర్థము
నిట్టులఁ గలయంపి చల్లిరి ?
ఎవరురా నా పూజామాలిక
నిట్టులఁ దెగ ద్రెంపి వేసిరి ?
ఎవరురా నా గీతాపుస్తక
మిట్టులఁ బుట లెల్లఁ జింపిరి ?
ఎవరురా నా యర్చన వేదిక
నిట్టుల దీపము నార్పిరి ?
ఎవరురా నా హారతి పళ్లెర
మిట్టుల బోరల దోసిరి ?
చోరుఁ డెవ్వఁడో యతిథి వేషమునఁ
జొచ్చెను నాపర్ణశాలను ;
నామూల ధనమెల్ల లూఁటిగొట్టి
నన్ను బికారినిఁ జేసెను !

# పూర్వజన్మస్మృతి

ఉ. శారద చంద్రికా మధుర శర్వరులన్ భవదీయ వేణుగీ
తారవ మాలకించి యెడదల్ నిలుపోపక మోహమాధురీ
ప్రేరిత చిత్తలై యభిసరించిన గోపిక లొందినట్టి గం
భీర మనోవ్యథల్ కలతపెట్టెడి నన్ను యశోద నందనా!

శా. ఏకాలంబున నేయుగంబుననొ యింకేపూర్వ జన్మంబునన్
నీకల్యాణ మనోహరాకృతిని నే నిత్యంబు దర్శించిన
ట్లే కన్పట్టెడిఁ గృష్ణ! కానియెడ నిట్లేలా మనోవీథి నీ
యాకారంబు సువర్ణముద్రితముగా నానందముం గొల్పెడిన్.

ఉ. పోతన లేఖినీ మహిమ పూర్ణ సుధారసధార నాని నా
చేతము నందు నీస్మృతి విచిత్ర గతిం జవురించెనేమొ! లే
దాఁ దనివార నీచరణ తామరసంబులఁ జింతసేయ నా
కే తలపోఁతగల్గెనొ గ్రహింపనసాధ్యము లోకమోహనా. 3

మ. తెలుగుంగైత యొయారపుటోకడలలోఁ దీపుల్ విసాళింపని
శ్చలభక్తిన్ రచియించెఁ బోతన భవచ్చారిత్రముల్; తత్క
థాకలితానేక విశేషముల్ మనసుఁజక్కన్ రేఁప నాపూర్వజ
న్మలచర్యల్ పొడకట్టు భావమున బింబంబద్ద మందుంబలెన్.

ఉ. పూతన పాలుద్రావి విసపున్నగుఫల్ వెలిజాఱ, ముగ్ధశో
భాతరళాక్షులన్ నగఁ బట్టఁగ లేక యొకింతమోముప్పుచున్
వ్రేతల గుండియల్ వగులు వేడ్కఁ జరించెడు నిన్నుఁ గాంచి నే
భీతిలి తల్లిజానువులఁ బెట్టునఁ గౌఁగిలినట్టుదోచెడిన్. 5

చ. తరువులు పెల్లగిల్ల, గిరితండము కొమ్ములు వ్రీల, దిద్దిరం
దిరుగుచు నిండ్లు నిండ్లుగనె నింగి సుడింపగ రేఁగిపీచునా
మరుతమునందు నిన్ గగనమధ్యమునం గనుగొన్న నాఁటియా
వెఱపిప్పుడైనఁ గాని ననువీడదు; నిద్దుర నుల్కఁగొల్పెడిన్. 6

ఉ. చీటికి మాటికిం దులిపిచేఁతలు చేసెడి నిన్నుఁ గాంచి యిం
కాటలు మానరాతనయ, యంచు యశోదవచించి త్రాటితో
ఱోటికి నిన్నుఁ గట్టె నెగరొప్పుచు మద్దుల సందుకీడ్చి యు
ద్ఘాటనముం బొనర్చు నినుగన్గొని కాలికి బుద్ధిసెప్పితిన్. 7

చ. మఱచితి ముద్దుకృష్ణ! యొకమాపటివేళ యశోదమందలోఁ
దిరుగుటఁ గాంచి మీఁగడలు దెచ్చి, సఖుల్ మనవెంటరాగనం
దరమును నారగింప, నను తల్లి కనుంగొన, లేచి, మీఁగడే
మెఱుఁగమటంచు నమ్మయొడియెక్కిననీ చెయిదంబు దోఁచెడిన్.

సీ. కన్నీటిధారలం గరఁగిన కాటుక
మఱకలు బుగ్గల మెఱయుచుండ;
క్రీఁగంటిచూపుతోఁ గద్దోయిఁ గాపీన
మును మెలివెట్టుచు, ముద్దులొల్క

వినయంబు మూర్తీభవించిన తెఱఁగునఁ
దలవంచి నిలఁబడి, తల్లి, నేను
నేమి చేసితినంచు నేమియెఱుంగని
పసిపాప యట్టులఁ బలికి, విశ్వ
మోహనాలోకనంబుల మోసపుచ్చి
తప్పులెల్లను మఱపించి, దండనంబుఁ
జేయనుంకించు తల్లి యాశీస్సుఁ బడసి
మురిపెముం జల్కు నిన్ను నే మఱవఁగలనె ? 9

సీ. సిగలోని పింఛెంబు చిన్ని తెమ్మెరలకు
గగనాలవింటి వర్ణముల నీను;
నీలిమబ్బులవంటి నెమ్మోని నిగ్గులు
చల్లని శాంతరసంబు గురియ;
మొలత్రాటఁ జెక్కిన మురళి కొండలగాలి
కొంకవింత రాగంబు నూఁదుచుండ;
సగము మెక్కిన వెన్న వెగటుగాఁ గొట్టిన వెన్న
ముద్ద యెండఁ గరంగి బొట్లుగాఱ;
వలువదాచినయావులఁ జెలులు వెదుక
నేఁటిపచ్చిక గట్టుల నేఁగుచున్న
నిన్నుఁ గనుఁగొన్నజ్ఞప్తి నాకున్నదోయి
యిన్ని జన్మంబులకు నైనఁ జిన్నికృష్ణ ! 10

చ. మటమటమొండలం బసుల మావులక్రిందఁ బరుండఁదోలి చి
క్కటిపెరుగన్నముల్ మిరపకాయలునంజుచు నారగించి యొ
క్కట గుమిగూడి, యాదవులగాథలు నీవువచింపఁగన్ నదీ
తటపవనంబుపైఁ గడఁదాఁకినసంజలు నేఁడుఁ గల్గునే? 11

క. కాళింది మడుగులో నా
భీలవిషజ్వాల లెపుడు వెలిగ్రక్కుచు మా
బాలురఁ బెయ్యలఁ జంపిన
కాళియఫణి కథలు దలఁపఁ గాయమువడఁకున్. 12

శా. ఆసర్పంబు భయంబునంబసులు నీరానన్ విలంబించి యా
కాసారంబునుడాయఁబోఁబు వెనుకోఁగాఁజూచి నాగేంద్ర! చా
వాసన్నంబయియుంట నీ పొగరుఁబో తాటల్ విజృంభించెఁగా
నీ సైతెమ్మని హుంకరించిన నిసుర్ నేఁడైన నూహించెదన్.

చ. బరబరఁ జేలముల్ నడుముపై బిగియించి కిశోరసింహ మ
ట్లురవడిఁ జూపి, మమ్ముఁగని యో సఖులార, భయంబు లేదు; నే
నురగముఁ జంపివత్తునని యొడ్డుననున్న కుజంబునెక్కి మో
హారమునఁ బాముపై దుమికినప్పటి నీరభసంబు దోఁచెడిన్. 14

సీ. బుస్సుబుస్సునగాలి భోఁకొట్టినట్టుల
విసపు నిట్టూర్పులు దెసలుముట్టఁ,
బాతాళగర్భంబుఁ బగిలించి శేషాహి
పైకిలేచినరీతి ఫణములెత్తి

శోకజాడింపంగఁ దోయప్రవాహంబు
అభ్రంకషోన్నతై యాకులింపఁ,
దరిగొండ మున్నిట గిరికొట్టి నట్టులఁ
గాళింగి మడుగెల్లఁ గలఁదిరుగుచుఁ,

ప్రాణిభీకర విహరణ పారవశ్య
మునఁ జరించెడి కాళియు ఘన ఫణముల
మణిగణద్యుతి యడఁగఁ దానగలఁ బూత
వెట్ట నటియించవే కృష్ణ! విజయినగుచు. 15

క. గోవర్ధన గిరియెత్తి శ
చీవల్లభు గర్వశాంతిచేసి, సుముఖ మా
గోపుల వానలఁజావక
కావవె శ్రీకృష్ణ! నీ కారుణ్యమునన్. 16

మ. యమునాశ్యామల వీచికాంతులలాస్యంబుల్, శరచ్చంద్రికా
కమనీయానుల సైకతంబు, మురళీగానంబు బృందావన
ద్రుమసంస్కృతడోలికల్ ఘనముసంమందోఁపఁ బూర్వానుభూ
తముగాఁ గోర్కెలు మోసులెత్తెడిని రాధాకృష్ణ! యీ నె
[న్నెలన్.

చ. చిరవిరహంబునం బసవు స్వీయవిధంబున బృందనేఁడు నీ
చరణసరోజసంగతుల సౌఖ్యముఁబాసి కృశించెఁ; గ్రమ్మఱన్
మురళినిమర్మమూర్ఛనలు మ్రోయుచు రమ్మిఁక ప్రేమరాజ్యసం
భరణమనోహరాంగవిభవంబులలోకము మోహపుచ్చుచున్.

---

# రాజభిక్షుకుఁడు

పగలెల్ల వరిచేలఁ బనిపాటుచేసి
ప్రొద్దుక్రుంకెడివేళఁ బొలమునువీడి
యిలుసేరి నూకల నిగిరించి, వేడి
సంగటిఁ గుడిచెడి సమయంబునందు,
సన్నచీఁకటి రూప సౌందర్యగరిమ
మబ్బువాఱుచునుండ, మాకుటీరంపు
ద్వారంబు కడనిల్చి ధరణీవిభుండు
ముసిముసి నవ్వుల మొగమందగింప
సందె కబళము వేడెఁ!—జకితనై నేను
నొడలు కంపింపంగ నొక్కమాటైనఁ
బలుకఁ జాలక మోమువంచి నిలుచుంటి;
నంతనెచ్చోటికో నరిగెరారాజు.
అవి యివియని యెంచ నలవిగానట్టి
చిదురుఁ దలంపులు చీకాకువెట్టఁ
జేతిలోఁ గబళంబు చేతనేయుండ
నూరక కూర్చుండి యున్నతరుణమున
నెచ్చటనుండియో వచ్చి బిచ్చకుఁడు

జాలిపుట్టగ వేడ సందెకబళంబు.
కనికరంబున నేను గడియన్నమెత్తి
"యిదిగో కొమ్మ"ని చేత నిడితి; బికారి
యానవాలుగ దీని నర్పింతుననుచు
నుంగరంబొక్కటి యొసఁగి తా నేఁగె;
నంత దీపపువెల్గు నందు నే దానిఁ
గన, రాజముద్రిక యసి తోఁచె; నేఁడు
రాజు భిక్షార్థియై రాఁగతంబేమొ
మాబోఁటి నిఱుపేద మాలకొంపలకు ?

# మృత్యువు

---

ఓమృత్యుదేవతా ! యోజగద్రాజ్ఞి !
జంటబిడ్డలపోల్కి జన్మించినారె
జీవితంబును నీవు సృష్ట్యాదియందు !
మనుజుండు నిన్నెవ్వ మహాసమయమూర్తి
భయసముత్పాదక బాహ్యవేషమ్ములఁ
జిత్రించి యాత్మీయ సృష్టినిఁ గాంచి
భీతచేతస్కుఁడై విభ్రాంతినందు !
మూఢభక్తియుఁ గాలమును బసుగుపేక
యునఁగ, భానమునాఁడె యుల్లలఁ గరుగఁ
బ్రీతిఁ బౌరాణిక విశ్వాసమనెడి
వల నేసి దైవ విపాకంబుకిత్తువఁ
బాపము ! తానందుఁబడి చిక్కుకొనియుఁ.
దప్పించుకొనుటకు దారి గన్పడదు.
ని కన్నుబొమ్మలు నీహారఖండ
శిశిరంబులంట ! నిర్జీవధావళ్ళి
జలదంబు నీకన్ను జంటచుక్కలను
గబళించునంట ! యో కాలస్వరూపి
ణీ ! మానవునితోడ నీవు నెల్లపుడు
దాగుడుమూతల తందనాలాడి
చేయిఁ జిక్కకయెందుఁ జేరఁబోయెదవో !
మూఢచిత్తులు నీకు మున్నొసఁగినట్టి
పౌరాణిక విచిత్ర వస్త్రములఁ దాల్చి

మహీ విహరింతువు మాఱువేసముల!
నీకాలిచప్పుడు సోఁక దిగులొంది
కంపిల్లు మనుజులఁ గని రహస్యముగఁ
జిఱునవ్వు నవ్వెదో చిన్నారిరాణి?
నీ మోసగింపులు, నీటక్కుఁదనముఁ
జాలింక! నెఱపుము సఖ్యంబు సకియ.
దయ్యాలముసుఁగేలదాల్చి త్రిమ్మరెదు?
నీ దొంగవేసంబు నే లాగివైతు;
ఎటువంటి నగుమోము, ఎట్టియందంబు
ముసుఁగుఁజీఁకటిలోన మునిగియున్నదిర!
కవితల్లజుండగు కాళిదాసైన
నీమోహనాకృతి నీదివ్యమూర్తి
నభినుతింపగలేక హతమనోరథుఁడు
కావలెనని చెప్పఁగా నన్నుబోఁటి
కర్షకకవియెట్లు కడతేరఁ గలఁడు?
  అందంబులకునెల్ల నందంబ వీవు;
నీకు నీవేసాటి నిఖిలలోకమున.
గారడికొలనులోఁ గలకల నగుచు
నిప్పుడిప్పుడె విచ్చు నిందీవరముల
సరిపోలు మురిపాల చక్కనికనులు
సౌందర్యరాజ్య విజయలాంఛనములు.
చెమరించు నీలేఁత చెక్కుటద్దముల
పన్నీరుపువ్వుల పస వెల్లివిరియుఁ
పచ్చిద్రాక్షరసానఁ బలుమాఱు నాన

వైవ మెత్తగనైన పవడంబుచేత
రచియింపఁబడెనో యోరమణి, రసార్ద్రి
మైననీవా తెలు! యానందదాయ
కంబైన వాసంత కల్యావో నీవు !
జీవరత్నకలాప చిత్రమకుటంబు
ఖద్యోతకాంతులఁ గనుబొమలపైనఁ
గురిపించు. నో పెండ్లికూఁతురా, మనము
ఆశ్చర్య పారవశ్యంబున నీదు
చంద్రశిలా రమ్యశాల, రహస్య
లీల నన్యోన్యముఁ గేలఁగేలూని
విడిపోని మమతల విహరింపలేదె ?
ప్రతిరాత్రి గాఢనిద్రావేళ నీదు
సుఖకర నిశ్శబ్ద చుంబన స్పర్శ
ననుభవించుచు నుందు నలసటదీఱ.
జీవనాంభోధి వీచీమార్గ మందుఁ
బ్రాణికోటులఁ బరపారంబుఁ జేర్చు
నుడుపంబు నేర్పుతో నడుపంగఁ, బ్రకృతి
నియమించె నిన్ను ; నో నిశ్చలకర్ణ
ధారిణీ! నవమూర్తి ధరియింపు మింక.
విపులపౌరాణిక విపిన సంచారి
ణీ ! రుద్రమృత్యువా! నీకు వీడ్కోలుపు.

---

# బిడ్డ : బాటసారి

## బిడ్డ

పై బాటలం బోవు నోబాటసారి!
నిసుగులకును నోట నీరూరునట్లు
దోరగిల్లి పసిండి తీరులొలికించు
పండ్లగుత్తులు వీఁపు పైన వ్రేలాడ
నలసట సోలుచు నరుగుదెంచెదవు.
నీపయనంబింక రేపుమాపులను
ముగియదా యేమి యోముసలి తాతయ్యా?

## బాటసారి

నీవలెనొకనాఁడు, నిండారఁ బూచి
పచ్చి తావులు చల్లు పన్నీరుపువ్వు
పోల్కి నవ్వుచు నేను బుట్టితిఁ; గాని
పుడమి సంతను నాదు పొలుపునెత్తావి
వెదచల్లి, కారాకు విధమున నొంటి
నేఁగుచున్నాఁడ మాయింటికి నేఁడు
యుగయుగంబుల నాఁటి సొగసైన పసిఁడి
పండ్లబరువులు వీపు పై మోచికొనుచు.

పలుగ్రహంబులకును బయనంబు చేసి
భవపిపాస హరించు పండ్లుఫలాలు
అలమట పడియైన నార్జించుకొందు.
నెనలేని యైశ్వర్య మెపుడు గడించి
విశ్వసామ్రాజ్యంబు విలుతునో గాని
యంతదనుకను నేను నక్షత్రాళు లరుగఁ
దిరుగుచుండెద నోయి మురిపాల బిడ్డ!

బిడ్డ

అట్లైన నీకెప్పుడలసట కోర్చి
పండ్లగుత్తులు నీవు పైనూఁగులాడ
నీవలెఁ జరియింతు నేను నీబాట.

బాటసారి

చరియించుచున్నావు చక్కనిదాన !

బిడ్డ

నీవలె నేనెపుడు నిఖిలవిశ్వంబు
విత్తంబుఁ గడియించి విలుతునో చెపుమ ?

బాటసారి

గడియించుచున్నావు; కడకొక్కనాఁడు
నేను బోయినదారి నీవు రాగలవు !

# మేలుకొలుపు

తే-గీ. ప్రత్యూషశ్శాంత నిర్మలాంబరమునందు
నరుణరక్తిమ వ్రాసె జయాంకములను;
జిమ్మచీఁకటి తెరలను జింపి వైచి
మేలుకొనుమమ్మ ! యింకనైన మేలుకొనుము !

తే-గీ. పవలు రేయు నతీంద్రియ స్వప్నములను
గనుచు నవియెల్ల సత్యమంచని తలంతే?
కలలకును వీడికోలుగాఁ బులుఁగులిపుడు
గానములు సేయుచున్నవి; కనవా? వినవా?

తే-గీ. నిద్రయే జీవనంబని నీకునున్న
నూరిపోసిరి మాయలమారు లెవరో !
మచ్చు మందుల నుతకమ్ము విచ్చిపోవఁ
గడపఁ గాల్మెట్టి లేయొండఁ గ్రాఁగుమమ్మ.

తే-గీ. అపయశః పంకిలంబైన యాత్మకన్న
చచ్చుటే కొంత మానరక్షణము సుమ్ము;
పారతంత్ర్య భరంబున బడలిసడలి
యదవ త్రావుడు త్రావెదో యమ్మ! నీవు?

తే-గీ. కాలగర్భంబునన్ దాఁగి కానరాని
భావిదృశ్యంబు కన్నులఁ బడినయట్లు
నలుదెసలఁ బ్రొద్దుపొడుపు నిగ్గులు రచించె
నభినవజగంబు; ముసుఁగెత్తి యరయుమమ్మ.

తే-గీ. కర్మ, విధిచేష్ట, దైవనిగ్రహమటన్న
పిచ్చివేదాంతములఁ బోయెఁ బెద్దప్రొద్దు;
ఆత్మవిశ్వాస సూర్యోదయంబు కెలన
నిద్దురతమంబు కాల్మొడ్డి నిలువఁగలదె?

# వసంతోదయము

ఏలొకో మావులం జివురులెత్తఁగ, గావ్యరమా కరంబులన్
మేలన మాడునట్లు నునునీడలు దేలుచు నందగించు; నే
మూలనునైనఁ జాల యుపభోగ్యముగా ననిలంబు విచ్చుక్రొం
బూలయనుంగుదావి తడిపుప్పొడి తాఁకుల నామతించెడిన్.

ఎవరికి నెఱుంగరాక యేయింద్రజాలి
కుండు వీచెనొక్కొ నెమ్మి కుంచెనిపుడు !
చెట్టు చేమలు విలసిల్లెఁ జిత్రగతినిఁ
బువ్వు లాకులఁ బిందెలఁ బుష్కలముగ.
కోకిలాగంతుకులు మావికొమ్మ లెక్కి
యాలపించెదరిప్పు డయాచితముగ
హృదయసంస్పర్శిరాగంబు ! నేనియంత
వారి కాహ్వానపత్రికఁ బంపినాఁడు ?

గఱిక మొదలుగఁ దారకాగణమువఱకుఁ
గలుగుసృష్టి నీరవభాషఁ దెలుపుచుండె
నవనవోజ్జ్వల సుఖజీవనప్రభాత
దివ్యసందేశమును నేఁడు. తెలిసెఁ ! దెలిసె !!

ప్రభువసంతుఁడు నందనవనమునుండి
యాత్రసేయగ భూమిపై కరుగుదెంచె;
నతఁడు విడిసిన తలము లల్లవిగో పచ్చ
నాకుల గుడారముల పట్నమనఁ జెలంగు.

# ముసలిమాలెత

మిడిమిడి యెండ సోలుచు శమింపని తాపముతోడ నూరుపుల్
వెడలగ డొల్లయై కడుపు వెన్నెముకం గరమంటియుండగన్
బుడిబుడి మిట్టపల్లములఁ బూనికఁ గాలిడఁబోయితొట్రిలం
బడుచు గతి శ్రమన్ ముసలిమాలెత వచ్చుచు నుండె నెంటిగన్.

కాలకఠోరసీర మలికంబను ధారుణిదున్న లోతుగం
జాళులు వారెనా వళులుసాగి శ్రమాంబులు పిక్కటిల్లి, స్వే
తాలక వృత్తముల్ నొసలికావల నీవల వ్రేల నందు ము
త్యాలవిధంబునం దొరఁగు నాముదివగ్గు తలం జలింపఁగన్.

ఒంటిపూటైన నాఁకటిమంటదీఱఁ
గుడువ నొకకడియన్నంబు గూడకున్కి
నస్థిపంజరమైన దేహంబు గూడ
మోవలేదన సోలును ముసలియవ్వ

దారిద్ర్యదేవత తనరూపుగనుపింప
వగ్గువాలకమూని వచ్చెనొక్కొ!
భేతాళునాజ్ఞగావించు పిశాచంబు
పీనుఁగు నొడలిలో వెడలెనొక్కొ!
స్వార్థపరస్వాంతుఁడౌ రాజుచేఁబడి
లావుదూలిన దేశలక్ష్మి యొక్కొ!
సకలవస్తు ప్రదర్శన శాలలో నిడ్డ
మునిమియవధిఁదెల్పు మూర్తియొక్కొ!

యనఁగఁ జేయూఁతకఱ్ఱను నవనినూని
నడువఁజాలక తడఁబడి యడుగులిడుచు
నెండవేడికి మేనెల్ల నెరియుచుండఁ
జెట్టునీడకుఁ దానల్లఁ జేరవచ్చి ;

నను నచ్చోటనుగాంచి కూలఁబడి ప్రాణంబుల్ వెలింబాఱునో
యన నిశ్చేష్టతనుండి తేఱి కడుదాహంబెత్తె నీరమ్ముఁదె
మ్మను నర్థంబుగ దోసిలింబెదవి డాయంబట్టి చూపింప నం
తనె తద్భావమెఱింగి తాళదళపాత్రంబందు శీతాంబుల్,

కొనితెచ్చియీయఁ బెరుదగ
తనియంగాఁ ద్రావి యలఁత దఱిగినపిదపన్
నను దీనదృష్టిఁ గనుఁగొని
వినయముతో నిట్టులనియె వృద్ధాంగనయున్.

నోటఁదడిలేక మాటాడుదీటులేక
గాసివడియున్న నను గాంచి కనికరమున
నీరమును దాపి ప్రాణంబు నిలిపినట్టి
నిన్ను నేమని పొగడుదుఁ గన్నతండ్రి !

అని కృతజ్ఞతాసౌరభ మార్ద్రవచన
కుసుమములఁ జల్ల నేనును గుతుకమొంది
యవ్వచరితంబుఁ గనుఁగొను నాసక్తి
నిట్టులంటిని నాదరం బుట్టిపడఁగ.

ఎవ్వరిదాన వీవు? మఱియిచ్చటికిం జనుదెంచుటేల? నీ
కెవ్వరు చుట్టపక్కము లిఁకెయ్యెడకుం జన నిచ్చగల్గె నో
యవ్వ సమస్తముం దెలుపుమా యనఁ గన్నులబాష్పపూరముల్
నివ్వటిలంగ నాత్మకథ నెట్టనఁ దెల్పెను గద్గదోక్తులన్.

పడమటి మెట్టదేశములఁ బైరులు పంటలు వానలేమికిన్
వడఁబడియెండి కాటకమువచ్చిన సన్నజనంబు మంటలం
బడియెడి దోమగుంపటుల మాడి దినంబున కొక్కసారియున్
గడికబళంబు లేక కడుకష్టము నొందుచు నుండి రచ్చటన్.

డెల్టాభూములఁ బైరులు
గలవని యచ్చోటిజనులు కౌతుకపడుచున్
వలసలువచ్చిరి ప్రాణం
బులు నిలువం బెట్టు నాస పొంపిరివోవన్.

నాకూఁతురు నాకొడుకును
నాఁకలి యెట్టిదియొ యెఱుఁగనట్టులనన్నున్
సాకుచునుండిరి వేళకు
ఆకో అంబలియొ గలుగు నంతకునిడుచున్.

ముసలితనమునందు ముప్పతిప్పలుగల్గెఁ
దమ్మిచూలివ్రాలు వమ్ముపడునె?
కొడుకుఁగూఁతు మొన్నఁ గ్రొత్తజ్వరంబుల
నాతపెట్టి నేన బ్రతికియుంటి.

పండుటాకులురాల్పక పసరులొాలుకు
పిన్నకవటలవెదకె పాపిష్టిబ్రహ్మ!
ముసలిముదుకకు సంజీవి మెసవఁబెట్టి
విసముఁదినబెట్టె ప్రాయంపుఁ బిల్లలకును!
త్రుంగుటేరుదెగియుఁ గూలని ముదిచెట్టు
పగిదినయ్యొ నాదు బ్రతుకదేమొ!
యెవరికొఱకు మనుదు నిఁకమీఁదనిలలోన
భారభూతమైన ప్రాణమేల?

అనుచుం బట్టిన నిల్పరాని వెత యాస్యంబంను౯దొలఁకాడదృష్టి నిరోధంబొనరించు బాష్పకణముల్ చెక్కిళ్లపై జాఱ పండిన కేశంబులు వాయుతాడితములై నీరంధ్రఘర్మాంబు సేచనముంబొందగ నార్తమూర్తియయిసంస్తంభించి యున్నంతట౯.

వృద్ధనారిదైన్య మీక్షించి మద్హృద
యాబ్జమొలికెఁ గగుణ మనెడు మధువు;
ఆర్ద్రహృదయమునకు నార్తభావమునకు
నెట్టిపరిచయంబు లెసఁగియున్నొ!
అవ్వకొంతసేపు నట్టులే గూర్చుండి
యేమిదలఁచెనేమొ యేఁగునిచ్చఁ
గట్టెఁదడపుచుండఁ గని నేను బల్కితిఁ
దోడ్పడంగఁ గోర్కెతొందరింప.

కాయముజూడ దుర్బలము కన్నులపాటవముందొలంగె నేసాయమొనర్ప బంధువులు నైతము లేరట నెట్లుకాలముంద్రోయుదువవ్వ? యీకలుపు దుంపలు తీయను సత్తువైనలేదే యటుగాక నీకడుపు నెట్టుల నింపెద విట్టిపల్లెల౯.

ఎండుటాకుల వెన్నెల పండినటులఁ
బెదవిమూలలఁ జిఱునవ్వు పొదలుకొనఁగ
నవ్వ యిట్లనె నాయనా యైననేమి
పుట్టఁజేసిన దేవుండు పూరియిడునె ?
గొడ్డుకాటకమున బందుగులను జేరి
యదవత్రొపుడు త్రొవంగ నాస లేదు ;
అట్టులౌటను ఆకైన అంబలైనఁ
గూలియొనరించి కుడుచుటే మేలు నాకు.
కన్నకన్నవారల యిండ్ల కడపఁ ద్రొక్కి
బిచ్చమెత్తుట యన్న నాకిచ్చ లేదు
కాలుసేతులు నున్నంత కాల మొరుల
చేతికూటికి నాసింపఁ జిన్నతనము.

అనవిని యవ్వనైతిక గుణాతిశయంబున కబ్బురంబునొంది నెనరుమై వచించితిని నీదగునీతికి సంతసంబు గల్గెను; నిఁకమీఁద నీవెచటికిం జననెంచక ప్రత్యహంబు గైకొనుము మదీయగేహమునఁ గోరినయట్టుల నుజ్జిగన్నముఁ.

అనిన సంతసించి యవ్వ యిట్లనె నయ్య
కూలిచూపి నాకుఁ గూడు పెట్టు,
తిరిపెమెత్తి తిన్నఁ దీఱు నాయాకలి ?
రమ్ము పల్లెఁ జేర జిమ్మదీసె.

# పండిత ప్రతిజ్ఞ

ఉ. మొన్నటి పుష్యపంచమికి ముప్పదియేండ్లవయస్సు చెల్లె నిం
కెన్నిదినంబు లీగురువునింట వసింతు? సమస్తశాస్త్రముల్
తిన్నగ నేర్చుకొంటి“మనతిమ్మయశాస్త్రికుమారుఁ డెంతలో
నున్నతి కెక్కె”నంచు నను నూరిజనుల్ వినుతింతు రెప్పుడున్.

గీ. సగము ప్రాయంబు విద్యావిచారమందె
గడచె; సంసారసౌఖ్యంబుఁ బడయనైతి;
గొప్పవారింటఁ బెండ్లాడఁ గోర్కె గలదు
గాని దారిద్ర్యదోషంబు కంటకంబు.

గీ. ఎవరి నడిగినఁగాని “మీ కెంతయాస్తి?
పెండ్లికూఁతురి కేనగ పెట్టఁగలరు?
ఇంటిమర్యాద లెట్టివి? మా హెచ్చు నెంచి
పెండ్లి వేడుక నడుపంగఁ బ్రీతి గలదె?”

చ. అనిమఱియేమొయేమొ మరియాదలుగీదలు దెల్పనోర్పులే
వినివిని చీదరించుకొని పెండ్లిపెడాకులు మానుకొంటి; నై
నను జెలికాఁడు నామనమునం దొకకోరిక విత్తు నాఁటి తి
య్యని నుడికారపుందడిని సంతురమొత్తఁగఁ జేసె నిట్లనెన్.

చ. జను లనుకోఁగ విందు; నెలజవ్వని, తాఁకినఁ గందిపోవు మె
త్తని చివురాకుమేను, కనుదమ్ముల లోకము మోహపుచ్చుమో
హనమగు నింద్రజాలమొదొ యాడుచునుండు; విविక్తకాననం
బున నెలయేళ్లకూలములఁ బూఁబొదరిండ్ల వసించునొంటిగన్.

గీ. పేరు "కవిత" యంట, పెద్దలుం బిన్నలు
గారవింపఁ బెంపు గాంచునంట;
ఇష్టమున్నఁ, గోర్కె లీడేర్పఁ దనకుఁ దా
వరుని సరసహృదయు వలచు నంట!

మ. కులముం జూడదు, డబ్బు గోరదు, మనఃకూలంకషప్రేమతో
వలచుం దాను గురూపి నైన; నెటు నిర్బంధించి కామింప భూ
వలయాధీశునకైనఁ గానిపని; నీ పాండిత్యముం జూపి యా
పాలఁతిన్ లోఁగొను మన్నమాటలు మదిం బూరించెఁ బేరా
సలన్.

గీ. అఖిలశాస్త్రపురాణేతిహాసములను
సంస్కృతాంధ్రకావ్యకలాప సంపుటముల
మూటముల్లెలుగాఁ గట్టి మోసికొంచుఁ
దరలితిని గవితాస్వయంవరమునకును.

గీ జనకుఁ డొసఁగిన దేవతార్చనపుఁ బెట్టె
నంచు చినిఁగిన మడిపట్టుపంచెఁ జుట్టి
చంకఁదగిలించి, వెలిబూది సంచిగూడఁ
బదిలముగ దాఁచికొని దారిఁ బట్టినాఁడ.

సీ. తలయూఁచినపుడెల్లఁ దళతళద్యుతి నింపు
మకరకుండలములు మాకు లేవు;
పాండిత్యమున కనివార్యలాంఛనమైన
కాశ్మీరశాలువఁ గప్పలేదు;

లలితంపుఁగవ్వులగుండెలు ఝల్లుఝల్లన
గండపెండారంబుఁ గాలఁ దొడుగ ;
మునుకొని తనకన్న ముందు బారెఁడు వోవు
బిరుదు పేర్లెవరైనఁ బెట్ట రయ్యొ !
ఐనఁ గానిమ్ము, నా కున్నయంతవట్టు
కేమి లోపంబు లే దెవ రేమి యన్నఁ
గంచుగంటపు వ్రాయసకాఁడఁ గానె ?
మిగత భారంబు దైవముమీఁద నిడితి.

చ. అని తలపోయుచుం దుదకు నాకవితాలలితాంగిఁ బెండ్లి యా
డినగతి మోర తీవి నడకెక్కు సుమాళము సందడింప లోఁ
దొని కెడి భావిభోగపరిపోషపు భావన తెప్పలార్చుచున్
వనమునఁ గేగుచుండె మనపండితశాస్త్రి జయాభిలాషతోన్.

చ. చనిచని కొన్నినాళులు వసంతశుభోదయవేళఁ గొండదా
పున దిగఁబాఱువాఁక కిరుపుంతలఁ బూఁబొద లందగించు చ
క్కనివనిఁ జొచ్చి దప్పి నడగాసియుఁ దీఱ జలంబుఁ గ్రోలి చ
ల్లనిపొదరింటనీడఁ బదిలంబుగఁ గూర్కె సుఖంబు చేకుఱన్.

గీ. అంతలోన నెండయారాట మొక్కింత
దొలఁగఁ బూఁతగాలి తోడ వీచె ;
కొండసెలలసడులు కోయిలపాటలు
మిళితమయ్యె నొడలు పులకరింప.

మ. చివురాకుల్ దెగమేసిపోతరమునం జెంగించుచున్ దాఁటుచున్
దవుదవ్వేగుచుఁ గొమ్ము పుట్టుతఱిఁ బంతలాడి కండూతి వో

వ వడిఁ ముస్దల డీలుచుఁ హరిణశాబంబుల్ వినోదించుఁ గే
ళివిహారంబుల నిర్భయంబుగను, వల్లీచ్ఛాయ లాసించుచుఁ.

గీ. అట్టినవమోహనారణ్యమందు నొక్క
మావికొమ్మకు నల్లిన పూవుఁదీవ
తూఁగుటుయ్యాలఁ గూర్చుండి, తునిగి రాలు
విరుల జడిగొట్ట నొకవన్యతరుణి యూఁగు.

ఉ. ఆవలపించుతో యుయ్యాలి కొయ్యారము నేర్పఁ గలాపి ప్రేమసం
భావనతోడఁ గుత్తుకనుబయ్యెదమీఁదుగ మూపుఁ జేర్చి పూఁ
దావులఁ జల్లు క్రొవ్వేదతలాపిఁని మోమర మోపి, మెత్తగం
జేవిరితెక్కపై నిమురఁ జెల్వయొడింగనుమోడ్చి హాయిగన్.

ఉ. కోయిలపాటకత్తె తనకూఁతలతప్పులెలుంగు దిద్దికోఁ
బాయక యభ్యసించుఁ జెలిపజ్జన పాఠము; గోరువంక క
త్త్యాయతశిక్ష నైన దొసఁగంతయుఁ బోదు; సమర్థుఁడౌ [గురుం
డైయును జక్కఁజేయఁగలఁడా ప్రతిభాపరిహీనశిష్యులన్.

మ. అపుడే నిద్దుర లేచి పండితుడు,నయ్యాలూఁగునా లేమ యం
దపుఁజందంబును రూపురేక వెలుఁగొందం గాంచి యూహిం [చుఁబో
ణిపదాబ్జంబుల మ్రొక్కనం దొలఁగవే నిర్మాలమై పాపముల్
అపురూపం బిటువంటిమూర్తి యని వెయ్యాఖుల్ విలోకిం
చుచున్.

గీ. పలుకరింప నెంచి, పలికిన నేమేని
బెడఁద వచ్చు నన్న బెంగతోడ
నీళ్లు నములుకొంచు నెత్తిగోఁకుచు నిల్వఁ
జూచి చూడనట్లు చూచి చెలువ.

ఉ. ఉయ్యెల డిగ్గి పయ్యెదను నోరముసుం గిడి జవ్వనంపులా
గియ్యది యన్నపోల్కిఁ గను లెత్తియు నర్ధనిమీలితంబుగా
నయ్యలినీలవేణి నడయందము దోఁపఁగఁ జెట్టుచాటుకుం
జయ్యనఁ బోయి తేనియలు జాల్కొనఁ బల్కెఁ దెనుంగు
[మాటలన్.

గీ. సిగ్గు పైకొని చెక్కిళ్లు జేవురింప
సగముసగముగఁ బల్కె నాసొగసులాడి
"యతిథులరు, మీకు స్వాగతం బన్ననుడులు
పడెను జెవిలోన విని వినఁబడనియటులు.

గీ. ముగుదమాట సూదిమొన మోపునంతటి
సందుఁ జేయ నళుకు జాఱవిడిచి
పండితుండు పల్కె వనిత! నీవెవతెవు?
ఒంటికత్తె విచట నుండ నేల?

చ. అన విని కాంత నేఁ గవితనయ్య! వనాంతరసీమలందు రే
యునుబవ లెప్పుడుం బ్రకృతియుత్సవముందిలకించుచుంబికాం
గనలు మయూరముల్ సఖులుగాఁ బరిచర్యలుసల్ప నొంటిగన్
దినములఁ బుత్తు జవ్వనముఁ దీరునుదియ్యము శాశ్వతంబుగన్.

మ. కలికీ! యెంతటివింత! నీవె కవితాకళ్యాణివా? బాపురే!
తెలియం జాలకయుంటి, నీకొఱకు నే దేశాలు పట్నాలు కో
టలు పేఁటల్ గిరులేళ్లు దాఁటుకొనియూటాముల్లెభారంబునన్
దల చెప్పట్టగ బట్టగట్టి విసుగెత్తన్ వచ్చితిం గానకన్.

గీ. నిన్నుఁగూడి ధర్మనియతులఁ బాల్గొనఁ
దలఁచి వచ్చినాఁడ, వలచినాఁడ ;
నన్నుఁ ద్రోసిపుచ్చ న్యాయంబె? వైదిక
విధిహితంబుగాఁగఁ బెండ్లియాడు.

గీ. అన్నవేళకు నతిథు లభ్యాగతులును
నింటికరుదెంచి కూర్చుండ, వంట గింటఁ
జేయ నిల్లాలు లే దని చెప్పలేక
తెగఁబడితిఁ గాంత! యాకొఱ దీర్పు మింక.

సీ. హేమంతమున నైన నేటినీట మునింగి,
మడిదోవతులు పాఁతమైల లుదికి,
యిలు నూడ్చుటాదిగాఁ గల ప్రాఁచిపనులెల్ల
విసుగు వేసట లేక వెళ్లఁబుచ్చి,
దేవతార్చనవేది దీపంబు వెలిఁగించి
బానసంబున వంటపనులఁ దీర్చి,
యిరుగుపొరుగునిండ్ల కేఁగక తమయిల్లు
కనుపెట్టుకొని, దూది పెనఁచి దివ్వె
వత్తులను జేయుటో, లేక వలయువిస్త
రంట్లు గుట్టుటో తడిబట్ట లార్చుటయును

గాక యిల్లాలి కింకొక్క కార్య మున్నె?
యట్టిగృహిణీపదంబు నీ కౌను చాన !

సీ. వేదవేదాంగముల్ వివిధపురాణేతి
హాసముల్ నాబుద్ధి నరగిపోయె;
పంచకావ్యాల నేపట్టున నేశ్లోక
మడిగినవల్లింతు నప్పుడపుడె;
ఆత్రేండ్లు పాణినీయము పీల్చి పిప్పిఁ జే
సితి నది నాయందె జీర్ణమయ్యె
వసుచరిత్రంబున వ్యాఖ్యానయుతముగ
శ్లేషభంగుల విమర్శించినాఁడ
కడకుఁ జిన్నయసూరివ్యాకరణ మెల్లఁ
బుటలు మలినంబుగాఁగ నెప్పుడును జదివి
సిద్ధివడిసితి; నమరంబుఁ జిత్తశుద్ధి
తో నుపాసించి పొందితి దొడ్డఫలము.

సీ. శాకుంతలములోన శతసహస్రములుగ
వ్యాకృతిదోషముల్ బయలుపఱతు ;
భవభూతిసాహిత్యభాండార మెల్లను
గాసుకుఁ గాకుండఁ గడిగి వైతు;
బాణుని శ్రీహర్షు భారవి ఝూడింప
దొలిదెబ్బకైనను నిలువఁ గలరె?
తిక్కయజ్వకుఁ దలతిక్క మాన్పెద నన్నఁ
దెరపిగా నొకనాఁడు తీఱలేదు;

ఇంక దక్కినవార లదేమి లెక్క
ముక్కుఁ బట్టినఁ బ్రాణంబు మొదలె పోవు;
కాంత! నాకన్న నేర్పరుల్ గలరె చెపుమ?
నేను నను(గూర్చి పొగడుట నియతి గాదు.

గీ. సత్కవి, ప్రబంధ వేంకటేశ్వర విజయ వి
లాసకర్త నామది కెక్కలాగు వ్రాసెఁ
గాని, కొందఱు పాండిత్యగణ్యతావి
హీనతను దాఁచ, రస మని యేడ్చినారు.

చ. అని తనమూటముల్లెలు రయంబున విప్పి నెలంత! పొత్తముల్
గనుమ, యధీతమయ్యెనివి; గ్రంథములెన్ని యొమోయ లేకయిం
టను బదిలంబు చేసితిని; నాశ్రమ మెల్లను జింతచేసి నీ
గనుమ కృపాకటాక్షములఁ గామిని! నీమన సేమి చెప్పుమా!

గీ. తనకుఁ బరమశత్రుఁ డనలేనిఛాందసుం
డింత కెటులో దొరకె; నింతతోడ
విడువరాదటంచు వెలఁది సంతోషించి
హాస్య మనుభవింప నభిలషించి.

గీ. ధర్మశాస్త్రమెల్లఁ దనువున జీర్ణించె
నిగమవిధులయందు నిధులు మీరు;
అట్టులౌట దలఁప కెట్టుల నీనాఁడు
కులటతోడిపొందు గోరినారు?

గీ. అనిన విని ఛాందసుం డపు డదరి లేచి
వెలఁది యేమంటివి? నీ వెట్లు కులట వైతి?

బహుపతిత్వము స్త్రీలకు భావ్యమగునె?
ధర్మవైరుధ్య మక్కటా! దాపురించె.

గీ. ఇందుకా నేను బలుపాటు లెల్ల సైఁచి
యింత దూరమ్ము వచ్చుట యెమ్మెలాఁడి!
బ్రహ్మచారిని, బ్రాహ్మణపండితుఁడను
కులటసాంగత్య మేరీతిఁ గోరుకొందు.

చ. అని కపటంబులేనివెత లాననసీమను దేలియాడఁ గా
మిని! కులటత్వ మెట్టు లనుమేయము నీయెడ నన్నుఁ గాంతయున్
మనమున నుబ్బుహాస్యరసమాధురి కన్నులఁ జిప్పిలంగ లోఁ
గొని మొగమందు మాయవగఁగూర్చి వచించెఁ జరిత్రమంత [యున్.

సీ. వాల్మీకి ముసలితాపసి యయ్యె ననుఁ గూడి
రమణీయకళలఁ గరంచి యేలెఁ;
గాళిదాసుఁడు బిగ్గఁగౌఁగిట లాలింప,
శృంగారభోగనిర్వృతిని గంటి;
భవభూతి పాండిత్యపటిమంతో శాస్త్రస
మ్మతముగ ననుఁగూడి మాడినాఁడు;
భట్టబాణమయూరభారవిప్రముఖులు
దివ్యభూషాపేక్ష దీర్చినారు;
నన్నపార్యుఁడుఁ దిక్కన మున్నుగాఁగఁ
దెలుఁగుఁగవు లెల్ల నాముద్దు సలిపినారు;

ప్రాఁతవారల యనుభోగ్యపటిమ నడలఁ
గ్రొత్తగోవాళ్లు నాసించి కూడుచుందు.

చ. అన విని పండితుం డనును నందఱు ముంచిన ప్రాఁతలంజ వ
య్యనుబడుచుందనంబుఁ గనులారలఁజూచెడి ముద్దరాలిసొం
పును,దనుసౌష్ఠవంబు, వలపుంబస, లెట్టులు గాచి యుంచితో
వనిత! శరీరరమ్యతకు బ్రహ్మ వినీతిని గూర్పఁ డేలొకో?

గీ. అనుచు గ్రంథంబు లెల్లను నట్టె జవిరి
మూటముల్లెగ సవరించి, పొలఁతి! నేను
బోయి వచ్చెద, మనపొందు పొసఁగ దనినఁ
జెలియ చిఱునవ్వు నవ్వుచుఁ జెంతఁ జేరి.

ఉ. ప్రేముడిత్రోడ నాయురము బిట్టుగ నీకవుఁగింటఁ జేర్పకే క్రో
ధోమనుధర్మశాస్త్రరత! యూరకపోయెదె యంచుఁ దెచ్చి
ల్దీమస మూని కౌఁగిలిడఁ దేరకుఁ దత్తఱ మందిచూచు చే
మేమొ వచించుచుం గనుల నెత్తక చేతుల నూడఁబీఁకినన్.

సీ. ముద్దుమాటలు వల్క మోము చిట్లించుచు
శబ్దసంస్కారంబు చాలదనును;
అడవిపూఁదొడవులఁ దొడిగియుండుటఁ గాంచి
యీయలంకృతి లోప మెసఁగెననును;
మురిపంబు దళుకొత్త మోవి యానఁగఁ బోవ
నెంగిలిరస మంచు నీసడించు;
బలిమిమై గిలిగింప నులికి బారెఁడుదాఁటి
జిలిబిలినడ లెల్లఁ జెల్లవనును;

పెట్టరానట్టిసిలుగులఁ బెట్టి; చెలువ
యాటపట్టించి చెర్లాట మాడుచుండఁ,
గాననంబున నేడనో కానరాక
మురళిరావంబు వినవచ్చె మోహనముగ.

సీ. పూలగుత్తులఁ గాంచి పునికి ముద్దాడును
బికమనోహరగీతి విన్న మెచ్చు;
సెలయేళ్ల పాటలఁ జెవియొగ్గి యాలించు
రాలుఁబువ్వుల నేరి మాల గ్రుచ్చు;
పొదరిండ్లలోఁ దూటి పొదలయల్లికఁ జూచు
నడవిజింకలతోడ నాటలాడు;
సాంధ్యారుణాంకితజలదఖండముఁ గాంచు
వనరామణీయకమును దలంచు;
మధురరసము తనదు మనమునఁ దొలఁకాడ
లోకమెల్లఁ దేనెపాక మనును;
నిట్టిమృదులహృదయుఁ డెచ్చోటనుండియో
పిచ్చివానిపోల్కి వచ్చుచుండె.

ఉ. ఆతనిఁ జూచి కాంత, తనయంతు నెఱింగినచెల్మికాఁడు సాం [దా
ధ్యాతపకాంతులం బ్రకృతియందముఁ గాంచఁగ నేఁగుదెంచెఁ;
నాతరుణుం డొకళ్లొకరి యంసమునం జెయివైచి ముగ్ధసం
గీతములన్ రసంబు లొలికింపఁ దలంపులు దీవరింపఁగన్.

గీ. వచ్చి రాక మున్నె వరునిఁ గౌఁగిటఁ జేర్చి
మూఁతనడ్డకనుల ముత్తెసరుల
గతినిఁ బ్రమద బాష్పకణములు చిప్పిల్ల
నొడలఁ బుల్కనారు లుప్పతిల్ల.

గీ. రెండుకీలలు నేకమౌరీతి నిరువు
రొకరొకరి కౌఁగిళులలోన నుండి రపుడు;
వసుధఁ బ్రతిదియుఁ బ్రణయపిపాసతోడ
నొకటినొకటి నాశ్లేషించునొప్పు దోఁచె.

గీ. అనిమిషత్వమునొంది యాయద్భుతంబు
నరయుచుండెను శాస్త్రి నోరంత దెఱచి;
యంతఁ గౌఁగిలి వీడి యాయబ్జనేత్ర
పిన్ననవ్వులు మోమునఁ జిన్నె లొలుక.

ఉ. చాలిక శాస్త్రిగారు! శ్రమ చాల వహించి మదర్థమయ్యయో!
కాలుకుఁ గాలు గొట్టుకొనఁ గాననసీమకు వచ్చి యింత కే
మేలును బొందకే తిరిగి మీపురిఁ జేరుటఁ జూడ నాకునున్
జాలిజనించె; దైవము ప్రసన్నముగా, దిఁకఁ బొందునావుడున్.

గీ. ఈర్ష్య యొకవంకఁ బరిభవ మింకనొక్క
కడను జిత్తమ్ముఁ జుఱచుఱఁ గాల్చుచుండఁ
గటము లదరఁగఁ గనుబొమల్ నటనసేయఁ
బండితుడు పళ్లు బిగఁబట్టి ప్రతినచేసె.

శా. నేనేతిమ్మయశాస్త్రిపుత్త్రుఁ డయినన్ నిత్యమ్ముఁ గాత్యాయనీ
ధ్యానారూఢమ్మౌదబ్జర్గ విధులసద్ధర్మంబులం బ్రత్యుష

స్నానంబుం బొనరింతు నేనిఁ గవితా! సత్యంబుగా నీజిగుల్
నీనాణెంబు నయారియంచనడల్గ నిర్మూలముం జేసెదన్.

మ. అని కోపంబున మూటముల్లె గొని సంధ్యావందనాపేక్షచే
వనమార్గంబునుబట్టి యేటిదరికిం బాండిత్యవాహుండు పో
యిన, నాయిద్దఱు నెచ్చెలుల్ వనవిహారేచ్ఛం నదీసైకతం
బునకుంబోయిరిజంటఁ బాయకమనంబుల్ దేహముల్ వర్తిలన్.

గీ. సందెచీఁకటిలో నెదో చాయనుండి
వీనులం బడె నశరీరగాన మొండు;
ప్రకృతి నిదురించె నాజోలపాటలోని
తియ్యఁదేనియ లక్కఱ దీఱ నాని.

THE INDIA PRINTING WORKS, MADRAS, 1924.